జలమే జయం...!



- నీరుంటేనే అభివృద్ధి
- విలువ తెలుసుకుని వాడుకోవాలి
- పొదుపును అలవర్చుకోవాలి

నేడు ప్రపంచ జల దినోత్సవం

వివరాలు 6లో

మెడికల్ షాపులపై దాడులు



హిందూపురంలోని నాగశ్రీ మెడికల్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఈగల్ టీం

- ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్ముతున్నట్లు గుర్తింపు
- చర్యలకు సిఫార్సు చేస్తామన్న విజిలెన్స్ అధికారులు

వివరాలు 7లో

తాడిపత్రిలో ఉద్రిక్తత

ఫయాజ్ ఇంటిపై రాళ్లదాడి.. వాహనం ధ్వంసం



ఫయాజ్‌బాషాతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ

- వైసీపీ నాయకుడు ఫయాజ్‌బాషా ఇంటి నిర్మాణంపై వివాదం
- అనుమతి లేదని కూల్చివేసేందుకు వెళ్లిన మున్సిపల్ అధికారులు
- కోర్టు పరిధిలో ఉందని అభ్యంతరం చెప్పిన ఫయాజ్‌బాషా
- జేసీ ప్రభాకర్ రెడ్డి అక్కడికి వెళ్లడంతో వాగ్వాదం


వివరాలు 7లో

మగ్గానికి వెలుగులు

ఉచిత విద్యుత్ అమలుతో చేనేతకు గొప్ప ఊరట

ధర్మవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): చేనేతకు ప్రభుత్వం అండగా నిలిచింది. మగ్గాలకు ఉచిత విద్యుత్ హామీని అమలులోకి తెచ్చింది. దీంతో నేతన్నల్లో ఆనందం వ్యక్తమవుతోంది. యువగళం పాదయాత్ర సందర్భంగా చేనేతలకు నారా లోకేశ్.. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. యువగళంలో భాగంగా ధర్మవరంలో ఏర్పాటు చేసిన చేనేతల ముఖాముఖిలో నేతన్నలు తమ ఇబ్బందులను యువనేత దృష్టికి తెచ్చారు. తాము అధికారంలోకి రాగానే చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. దానిని నిలబెట్టుకున్నారు. మగ్గాలకు ఉచిత విద్యుత్‌పై జీఓ జారీ చేయడంతో చేనేతలు, కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ధర్మవరం, ముదిరెడ్డిపల్లి, సోమందేపల్లి, గోరంట్ల, హిందూపురం ప్రాంతాల్లో మగ్గాలు ఎక్కువగా ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 13వేలదాకా చేనేత కుటుంబాలు ఉండగా.. దాదాపు 30వేల మంది కార్మికులు మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నారు. మరమగ్గాలు 10వేల దాకా ఉన్నాయి. ఉచిత విద్యుత్‌పై ప్రభుత్వం విధివిధానాలను రూపొందిస్తోంది. అర్హులు దరఖాస్తు చేసుకుంటే విద్యుత్, చేనేత, జౌళి శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ప్రభుత్వ నిర్ణయం జిల్లాలో 50శాతం మంది చేనేతలకు ప్రయోజనం చేకూర్చనుంది. చేనేత, మరమగ్గాల సంఖ్యతోపాటు అవి పని చేసే సమయాన్ని బట్టి కూడా స్లాబ్ మారే అవకాశం ఉంది. సగటున తీసుకుంటే పట్టణంలో నాలుగు చేనేత మగ్గాలు, రెండు మరమగ్గాలను వాడుకునే అవకాశం ఉందని చేనేతలు అంచనా వేస్తున్నారు. ఆ మేరకు తీసుకుంటే కుటుంబానికి నెలకు రూ.1000 నుంచి రూ.5 వేల వరకు మిగిలే అవకాశం కనిపిస్తోంది.

చేనేత మగ్గాలకు 200 యూనిట్లు.. మరమగ్గాలకు 500 యూనిట్లు ఫ్రీ.. మాట నిలబెట్టుకున్న నారా లోకేశ్ నేతన్నల హర్షం





భారమైన జీవితాలకు భరోసా



నమ్ముకున్న వృత్తిని వదులుకోలేక పెట్టినపెట్టుబడి కూడా తిరిగిరాని పరిస్థితుల్లో చేనేతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ నిర్ణయం భరోసా నింపుతోంది.

- గాండ్ల చంద్రశేఖర్, చేనేత కార్మికుడు, శాంతినగర్, ధర్మవరం

ఉపశమనం



చేనేత రంగం తీవ్ర సంక్షోభంలో ఉన్న ప్రస్తుత తరుణంలో ప్రభుత్వం ఉచిత విద్యుత్ వర్తింపజేయడం సంతోషదాయకం. నేతన్నలపై ఆర్థికభారం తగ్గుతుంది. వైసీపీ హయాం లో సబ్సిడీలు ఎత్తివేయడంతో ముడిసరుకుల ధరలు నేతన్నలకు భారంగా మారాయి. ఈ తరుణంలో ప్రభుత్వ తాజా నిర్ణయం ఉపశమనాన్నిస్తుంది.

- వెంకటనారాయణ, ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ధర్మవరం

ఆంక్షలు ఉండకూడదు



నేతన్నలకు ఉచిత విద్యుత్ వరంలాంటిది. లబ్ధిదారులను తగ్గించాలన్న ఉద్దేశంలో పథకం వర్తింపులో కఠినమైన ఆంక్షలు విధించరాదు. కార్మికులకు ఇళ్లలోనే మగ్గాలు ఎక్కువగా ఉంటాయి. ఈ రెండింటిని పరిగణనలోకి తీసుకోవాలి. కూలి మగ్గాలనూ తీసుకోవాలి. గుర్తింపు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వర్తింపజేయాలి.

- అన్నం సురేశ్, చేనేత కార్మికుడు, కేశవనగర్, ధర్మవరం

ప్రభుత్వంపై ఆశలు



చాలీచాలనీ ఆదాయంతో విద్యుత్ బిల్లులు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఈ పరిస్థితుల్లో ఉచిత విద్యుత్ వర్తింపజేయం ప్రోత్సాహాన్నిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని పథకాలు అమలు చేసి, నేతన్నకు పూర్వవైభవం తెస్తారనే ఆశలు చిగిరిస్తున్నాయి.

- పెద్దకోట్ల గణేశ్, చేనేత కార్మికుడు, శారదానగర్, ధర్మవరం

అభ్యంతరాలు తెలపండి

కలెక్టర్ టీఎస్ చేతన్



పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తిటౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తాజాగా రూపొందించిన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే తెలపాలని రాజకీయ పార్టీ ప్రతినిధులను కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ భవనంలో శుక్రవారం ఓటరు జాబితా అభ్యంతరాలపై గుర్తింపు పొంది న రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఆర్డీవోలతో కలెక్టర్ సమావేశం నిర్వ హించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాజాగా 14,12,177మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు.

ఇందులో 7,01,586 పురుషులు, 7,10,527 మంది మహిళ ఓటర్లు, 64మంది ట్రాన్స్‌జనరల్ ఉన్నట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 1,576 పోలింగ్ కేంద్రాలున్నట్లు వెల్లడించారు. రాజకీయపార్టీలు పోలింగ్‌శాతం పెంచేందుకు, తప్పులులేనిఓటరు జాబితా తయారు చేసేందుకు సహకరించాలన్నారు. ఆయాపార్టీల ప్రతినిధులు బూత్‌స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. జిల్లా యంత్రాంగం అన్ని నియోజకవర్గాల్లో బీఎల్‌ఓలను నియమించి, శిక్షణ పూర్తి చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, సామకోటి ఆదినారాయణ, జనసేన ప్రతినిధి అబ్దుల్‌ఖాదర్, సీపీఐ అంజి, బీజేపీ ఓబులేసు, వైసీపీ రంగారెడ్డి, డీఆర్‌ఓ విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి నివేదికలు సమర్పించాలి : కలెక్టర్

పుట్టపర్తి టౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): త్వరలో అమరావతిలో జరగనున్న కలెక్టర్ల సమావేశానికి సంబంధించి జిల్లాలోని అన్ని శాఖల ప్రగతి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో అన్నిశాఖల అధికారులతో శుక్రవారం ఆయన ప్రగతి నివేదికలపై సమీక్షించారు. ప్రగతి, ప్రాధాన్యతాంశాలు ముఖ్యమంత్రికి వివరించేందుకు అవసరమైన సమాచారం సిద్ధం చేయాలన్నారు.

రాబోవు మూడు నెలల్లో పంచాయతీ, మున్సిపల్, ఇరిగేషన్, డ్వామా, వ్యవసాయం, గృహ, విద్య, వైద్య, పరిశ్రమలు, డీఆర్‌డీఏ, సంక్షేమ శాఖల పరంగా చేపట్టాల్సిన కార్యచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఉద్యానశాఖా ధికారి చంద్రశేఖర్, డీఎఫ్‌ఓ చక్రపాణి, ఎల్‌డీఎం రమణకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ మల్లికార్జునయ్య, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, టూరిజం శాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, పశుసంవర్ధశాఖ జేడీ శుబదాస్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష రాస్తుండగా అస్వస్థత



చికిత్సపొందుతున్న విద్యార్థి జగన్

కొత్తచెరువు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష రాస్తూ ఓ విద్యార్థి హఠాత్తుగా పడిపోయాడు. మండలంలోని కేశాపురం జడ్పీ ఉన్నతపాఠశాలకు చెందిన జగన్ ఇంగ్లిష పరీక్ష రాస్తూ ఛాతిలో నొప్పిగా ఉందంటూ, ఊపిరి ఆడలేదని కిందకు పడిపోయాడు. వెంటనే ఇన్విజిలేటర్, అక్కడి ఉపాధ్యాయులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయించారు. విద్యార్థి జగన్‌కు ఈసీజీ, బీపీ పరీక్షలు నిర్వహించారు. గ్యాస్ ట్రిక్‌తో ఇబ్బందులు పడుతున్నాడని ఇందుకు సంబంధించి వైద్యం అందించినట్లు వైద్యులు తెలిపారు. రికవరీ కావడంతో ఆ విద్యార్థిని పరీక్ష రాసేందుకు అనుమతించారు. అరగంట అదనపు సమయం కేటాయించాలని డీఈఓ కిష్టప్ప పరీక్ష నిర్వహణ అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. దీంతో విద్యార్థి జగన్ పరీక్షరాశాడు.

ఇంగ్లీషు పరీక్షకు 111 మంది గైర్హాజరు

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి ఇంగ్లిషు పరీక్షకు 111 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ కిష్టప్ప శుక్రవారం తెలిపారు. 104 కేంద్రాల్లో 21,396 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 21,285 మంది పరీక్షలు రాసినట్లు తెలిపారు. దీంతో హాజరు శాతం 99.48గా నమోదైందన్నారు. ఓపెన్ పదో తరగతికి సంబంధించి 11 కేంద్రాలలో ఇంగ్లిషు పరీక్షను 518 మంది రాయాల్సి ఉండగా 424 మంది హాజరయ్యారని, 94మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

సంతోషం కోసం చంపేశారు..!

- హత్య కేసు నిందితుల వెల్లడి
- వివాహేతర సంబంధమే కారణం
- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



నిందితులను చూపుతున్న డీఎస్పీ, సీఐలు

హిందూపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సద్దాంబేగ్‌ని చంపితేనే తాము సంతోషంగా ఉంటామని భావించే హత్య చేసినట్లు విచారణలో నిందితులు ఒప్పుకున్నట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. ఈ నెల 18న మలుగూరు చెరువు కట్ట వద్ద వెలుగు చూసిన హత్యకు సంబంధించి నిందితులను శుక్రవారం అరెస్ట్ చేశారు. వివరాలను వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో డీఎస్పీ విలేకరులకు వెల్లడించారు. పట్టణంలోని శాంతి నగర్‌లో నివాసమున్న సద్దాంబేగ్, కోట మీద గడ్డ ప్రాంతంలో నివాసమున్న మహమ్మద్ షఫీ భార్య అయేషాతో కొద్దిరోజులుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. అయితే మహమ్మద్ షఫీ మూడేళ్లగా భార్యకు దూరంగా ఉన్నాడు. 20 రోజుల కిందట భార్య వద్దకు వచ్చాడు. తన భార్యతో సద్దాం బేగ్ చనువుగా ఉండటం గమనించి గొడవపడ్డాడు. ఈక్రమంలోనే తనపై దాడి చేశాడని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో మహమ్మద్ షఫీ ఫిర్యాదు చేశాడు. 17న రాత్రి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అయేషా, సద్దాం బేగ్ ఉండటం గమనించిన మహమ్మద్ షఫీ, అతడి సోదరుడు తౌఫిక్, సోదరి రేష్మా, వీరి తల్లి సల్మా మాట్లాడదామని మృతుడిని బయటికి తీసుకెళ్లారు. ద్విచక్రవాహనంలో మహమ్మద్ షఫీ, తౌఫిక్‌లు సద్దాంబేగ్‌ను మలుగూరు చెరువు కట్ట కిందకి తీసుకెళ్లారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా వారి వెంట తీసుకెళ్లిన వేటకొడవళ్లతో మెడపై నరికి హత్య చేశారు. నిన్ను చంపితేనే నేను నా భార్య సంతోషంగా ఉండగలమని, అందుకే నిన్ను చంపేస్తున్నట్లు మరీ చెప్పి సద్దాంబేగ్‌ను హత్య చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారని డీఎస్పీ పేర్కొన్నారు. నిందితులు నలుగురిని కోర్టులో హాజరుపర్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీఐలు ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీమ్, ఎస్‌ఐలు శ్రీధర్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ధర్మవరం విద్యార్థి



విద్యార్థి షమీమ్

ధర్మవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు స్థానిక కేహెచ్ డిగ్రీ కళాశాల డిగ్రీ విద్యార్థి షమీమ్ ఎంపికైనట్లు పీడీ ఆనంద్ శుక్రవారం తెలిపారు. రెండు రోజుల కిందట ఎస్కే యూనివర్సిటీ నిర్వహించిన సెలక్షన్స్‌లో షమీమ్ ఉత్తమ ప్రతిభ కనబరచిందన్నారు. తమిళనాడులో అలగప్ప యూనివర్సిటీలో ఈనెల 28 నుంచి ప్రారంభమయ్యే ఆలిండియా పోటీల్లో ఈమె ఎస్కేయూ తరపున పాల్గొంటుందన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 6, ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కిష్టప్ప శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సమగ్ర శిక్ష, ఎస్‌పీడీ ఆదేశాల మేరకు 7,8,9 తరగతులలో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11వతేదీ వరకు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో హెచ్‌టీటీపీ పీ...//ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఎంపికైన విద్యార్థులకు వారి మొబైల్ ఫోన్లకు సమాచారం అందిస్తామన్నారు.

అర్హులు వీరే..

గ్రామీణ ప్రాంతాలలో సంవత్సర ఆదాయం రూ.1.25లక్షలు, పట్టణ ప్రాంతాలలో రూ.1.40లక్షలు ఆదాయం ఉన్నవారు అర్హులు. అనాథలు, డ్రాపౌట్, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ దారిద్రరేఖకు దిగువనున్న బాలికలు ప్రవేశానికి అర్హులన్నారు. జిల్లాలో 30 కేజీబీవీల్లో 6వతరగతికి 1200, ఇంటర్‌కు 1200 సీట్లు ఖాళీ ఉన్నాయని ఆయన తెలిపారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.35 (శనివారం సాయంత్రం)
సెహరీ : 5.02 (ఆదివారం ఉదయం)

అసాంఘిక ఖాకీకలాపాలు..!

- వ్యభిచార గృహంలో పట్టుబడ్డ కానిస్టేబుల్
- నిర్వహణలో పోలీసు భాగస్వామ్యం
- తూతూమంత్రంగా దాడులు
- ఓ కానిస్టేబుల్‌పై కేసు నమోదు

హిందూపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాల్సిన పోలీసు సిబ్బందే వెనకుండి వాటిని నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది పోలీసులు.. అసాంఘిక శక్తులతో చేతులు కలపడం వల్ల ఆ శాఖకే మచ్చ ఏర్పడుతోంది. హిందూపురం, మడకశిరలో పనిచేసే చాలామంది సిబ్బంది.. అసాంఘిక శక్తులతో చేతులు కలుపుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇందుకు ఇటీవల హిందూపురంలో వ్యభిచార గృహంలో ఓ కానిస్టేబుల్ పట్టుబడటమే నిదర్శనం. ఐదేళ్ల వైసీపీ పాలనలో అసాంఘిక శక్తులకు గేట్లు పోలీసు శాఖ గేట్లు ఎత్తేసింది. ప్రస్తుతం కూడా కొంతమంది అసాంఘిక శక్తులతో చేతులు కలపడం శోచనీయం.

వ్యభిచార గృహంలో కానిస్టేబుల్..

హిందూపురం టూటౌన్‌లో పనిచేస్తూ ఇటీవల మడకశిర పోలీసు స్టేషన్‌కు బదిలీ అయిన కానిస్టేబుల్ అసాంఘిక కార్యకలాపాల్లో భాగస్వామి అవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. హిందూపురంలో కొన్ని దందాల్లో పాత్ర పోషిస్తున్నట్లు పోలీసు అధికారులు నిర్ధారణకు వచ్చారు. వ్యభిచార గృహాలపై దాడులు చేయగా.. అక్కడ కానిస్టేబుల్ పట్టుబట్టడం గమనార్హం. కొంతమంది పోలీసులే వ్యభిచార గృహాలను వెనకుండి నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. వ్యభిచార గృహాలు నిర్వహించే వారితో సంబంధం పెట్టుకున్నట్లు సమాచారం. ఈలెక్కన వారికి పోలీసుశాఖ సహకారం పుష్కలంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. అయినా పోలీసు శాఖ తూతూమంత్రంగా దాడులు చేస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

కేసు నమోదు

పురంలో వ్యభిచార గృహంపై రెండ్రోజుల క్రితం దాడులు చేయగా ఓ కానిస్టేబుల్ అక్కడే ఉన్నాడు. ఇక్కడకు ఎందుకు వచ్చావని అతడిని సీఐ ప్రశ్నించారు. ఆయన సరైన సమాధానం చెప్పకపోవడంతో అనుమానం వచ్చింది. పూర్తిస్థాయిలో విచారణ చేయగా.. వ్యభిచార గృహం నిర్వహణలో అతడి హస్తం ఉందని తేలింది. ఆ కానిస్టేబుల్‌ను హిందూపురం నుంచి దూరంగా పంపినా నెల తిరక్కుండానే ఈ ప్రాంతానికి వస్తాడు. దీనిని బట్టి ఆ కానిస్టేబుల్‌కు ఏస్థాయిలో అండదండలున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇంకా పలువురు సిబ్బంది అసాంఘిక కలాపాల్లో భాగస్వాములవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

రెడ్ హ్యాండెడ్‌గా దొరికారు

కానిస్టేబుల్ సహా 8 మందిపై కేసు



పురుషోత్తం

హిందూపురం పట్టణంలోని వ్యభిచార గృహాలపై ఈ నెల 18వ తేదీ రాత్రి టూ టౌన్ పోలీసులు దాడులు చేశారు. సీఐ అబ్దుల్ కరీమ్ నేతృత్వంలో ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఓ వ్యభిచార గృహంలో నిర్వాహకురాలు మంజుల, కానిస్టేబుల్ పురుషోత్తంను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కీలక పాత్రధారి, వ్యభిచార గృహాలకు అమ్మాయిలను రప్పించే ఈశ్వర్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని సీఐ శుక్రవారం తెలిపారు. పరిగి మండలం బీచిగానిపల్లికి చెందిన ఈశ్వర్, ప్రస్తుతం మేళాపురంలో నివాసం ఉంటున్నాడని తెలిపారు. సీపీఐ కాలనీలోని మరో వ్యభిచార గృహంపై దాడులు నిర్వహించి, వ్యభిచారం నిర్వహిస్తున్న బాబా, అతని భార్య షాజియా ఇంట్లో నలుగురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. నిందితులలో మంజుల, కానిస్టేబుల్ పురుషోత్తంను కోర్టులో హాజరుపరిచామని తెలిపారు. హిందూపురంలోని బోయపేటకు చెందిన మంజుల కుటుంబ కలహాలతో కొంత కాలంగా భర్తకు దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో గతంలో టూటౌన్ పోలీస్‌స్టేషన్లో పనిచేసిన కానిస్టేబుల్ పురుషోత్తంతో పరిచయం పెంచుకుంది. వీరు గతంలో మోడల్ కాలనీలో వ్యభిచార గృహం నిర్వహించేవారని సీఐ తెలిపారు. మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.



ఆరోగ్య చెలిమ..!

ప్రజల దాహం తీరుస్తున్న చెలిమ నీరు

శింగనమల చిన్న చెలిమలో నీరు తీసుకుంటున్న మహిళ

శింగనమల: నియోజకవర్గ కేంద్రం శింగనమల ఎస్సీ కాలనీవాసుల దాహార్తి తీరుస్తోంది చెలిమ. తరాలుగా చెలిమ నీరే తాగుతున్నామనీ, అనారోగ్య సమస్యలు తలెత్తట్లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. రోజూ చెలిమ నీటిని బిందెల్లో తెచ్చుకుని, తాగుతున్నారు. చెలిమ నీరు స్వచ్ఛంగా ఉంటోందని వారు చెబుతున్నారు. శింగనమల ఎస్సీ కాలనీ సమీపంలో రుషింగమయ్య కొండ ఉంది. కొండపై అక్కదేవతల పెద్ద కొలను ఉంది. ఆ కొలనులో నిత్యం నీరు పుష్కలంగా ఉంటుంది. వేసవిలో కూడా నీరు ఉంటుంది. కొండ చుట్టూ 7 కొలను చెలిమలు ఉన్నాయి. పూర్వం నుంచి ఈ చెలిమల్లోని నీటిని ప్రజలు తాగుతున్నారు. శింగనమల ఎస్సీ కాలనీ సమీపంలోని రేగలకుంట వద్ద చిన్న చెలిమ ఉంది. అందులోని నీటినే కాలనీకి చెందిన వెయ్యి కుటుంబాలవారు నేటికీ తాగుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బిందెలతో నీరు తెచ్చుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, శింగనమల

పశువులకు సైతం



ముచ్చురామిలో ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న ఓ కుటుంబం

ధర్మవరం రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చురామి, నేలకోట, బడన్నపల్లి ఎస్సీకాలనీ, ఏలుకుంట్ల పైకాలనీ తదితర గ్రామాల ప్రజలు తాగునీటి సమస్యతో అల్లాడుతున్నారు. ముచ్చురామిలో ట్యాంకర్‌కు రూ.1500 బాడుగలు వెచ్చించి నీటిని కొనుగోలు చేస్తున్నారు. పాడి పశువులకు కూడా నీరు లేకపోవడంతో వాటిని అమ్ముకుంటున్నట్లు పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఎండలు మరింత పెరిగితే మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాగా, గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు ధర్మవరం ఎంపీడీఓ సాయిమనోహర్ పేర్కొన్నారు.

సమస్త ప్రాణకోటికి జీవనాధారం నీరు. ఆయా ప్రాంతాల అభివృద్ధి అక్కడ లభించే నీటి వనరులపైనే ఆధారపడి ఉంటుంది. ప్రకృతి వరప్రసాదమైన నీటిని కొంతమంది ఇష్టానుసారం వృథా చేస్తున్నారు. అయితే చాలా ప్రాంతాల్లో స్వచ్ఛమైన నీటి కోసం ప్రజలు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ప్రాణాధారమైన నీటి కోసం దేశాలు, రాష్ట్రాలు, ప్రాంతాల మధ్య పంచాయితీలు జరుగుతూనే ఉన్నాయి. దీన్ని బట్టి నీటి ప్రాధాన్యం అర్థం చేసుకోవచ్చు. దేశంలో అత్యంత దుర్భిక్ష ప్రాంతంగా వాసికెక్కిన ఉమ్మడి జిల్లాలో ఉన్న అరకొర జలవనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. నేడు నిర్లక్ష్యం వహిస్తే రేపటి తరానికి శాపగ్రస్తమైన జీవితం తప్పదు. ఇప్పటికే వేసవి సమీపిస్తే చాలు ఉమ్మడి జిల్లాలో చాలా గ్రామాలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ప్రభుత్వం ప్రజల దాహార్తి తీర్చడం కోసం ఏటా కోట్ల రూపాయలు ఖర్చు పెడుతోంది. ప్రపంచ జల దినోత్సవం శనివారం జరుపుకుంటున్న సందర్భంలో ఉమ్మడి జిల్లా స్థితిగతులపై కథనం.

జలమే.. జయం..!

- నీరుంటేనే అభివృద్ధి
- విలువ తెలుసుకుని వాడుకోవాలి
- పొదుపును అలవర్చుకోవాలి
- భూగర్భ జలాన్ని రక్షించాలి
- ప్రజల్లో చైతన్యం పెంపొందించాలి
- ఇప్పటికే పల్లెల్లో తాగునీటికి కటకట

నేడు ప్రపంచ జల దినోత్సవం

తనకల్లు/ అనంతపురం న్యూటౌన్ మార్చి21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అరకొర నీటి ప్రాజెక్టులే తప్ప భారీ ప్రాజెక్టులు ఏవీ లేవు. అందుకే 80శాతం వ్యవసాయం వర్షాధారంగా సాగుతుంది. వేసవి వస్తే చాలు వాగులు, వంకలు ఎండిపోయి, బోరు బావులు అడుగంటి తాగునీటికి కూడా కటకటలాడాల్సి వస్తోంది. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంపొందేలా అవగాహన కార్యక్రమాలు ప్రభుత్వాలు చేస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. దీంతో తీవ్ర నీటి కరువు వేధిస్తోంది. కొన్ని చోట్ల వెయ్యి అడుగులు తవ్వినా నీటి చెమ్మ కనిపించని దుస్థితి ఉంది.



నీటి ఆదాకోసం తుంపర సేద్యం ప్రోత్సహిస్తున్న దృశ్యం

భూగర్భ జల రక్షణ కోసం ఉమ్మడి జిల్లాలో 2005 నుంచి వాల్టా చట్టం అమలు చేస్తున్నా... పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. జల సంరక్షణ కోసం జనజాగృతి వంటి స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రతి ఏటా పంట-నీరు ప్రణాళిక కార్యక్రమాలను చేపట్టి, రైతులకు నీటి వాడకంపై అవగాహన కల్పిస్తున్నాయి.

నీటి ఎద్దడి రానివ్వం



జిల్లాకు నీటి ఎద్దడి రానివ్వకుండా తగిని చర్యలు చేపడుతున్నాం. గుంతకల్లు మండలంలోని ఒక పంచాయతీ, శింగనమల మండలంలోని మరో పంచాయతీలో తప్ప జిల్లాలో ఎక్కడ సమస్యలు లేవు. శింగనమల మండలంలో బోరు వేయడం ద్వారా సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గుంతకల్లు మండలంలో బోరు వేసిన తగిన నీటి లభ్యత లేకపోవడంతో ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నాం.

-సురేష్, ఎస్ఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, అనంతపురం జిల్లా

జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్



అనంతపురం టౌన్: ప్రపంచ జలదినోత్సవాన్ని శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని అధికారులకు కలెక్టరు వినోద్‌కుమార్ శుక్రవారం ఆదేశించారు. తొలుత గ్రామీణాభివృద్ధిశాఖామంత్రి పవన్‌కళ్యాణ్ కలెక్టర్లతో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జలదినోత్సవం, పల్లెపండుగ నిర్వహణపై మంత్రి పలు ఆదేశాలిచ్చారు. అనంతరం కలెక్టరు జిల్లా, డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ తాను ఉరవకొండ నియోజకవర్గంలో జరిగే జిల్లా స్థాయి జలదినోత్సవంలో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. ప్రతి పంచాయతీలలోను 3నుంచి 5వరకు ఫారంపాండ్ పనులు మొదలు పెట్టాలన్నారు. జిల్లాలో 9వేల ఫారంపాండ్‌ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 6,864 మంజూరుచేశామన్నారు. జిల్లాలో మెటీరియల్ ఖర్చులకు రూ.186.41కోట్లు లక్ష్యం పెట్టుకోగా అంత కన్నా ఎక్కువగా ఖర్చు పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీమ్‌బాషా, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డీపీఓ నాగరాజునాయుడు, పంచాయతీరాజ్ ఎస్ఈ జహీర్‌బాషా, ఆర్‌డబ్ల్యుఎస్ఎస్ఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటిని ఒడిసి పట్టాలి



జిల్లాలో నీటిని ఒడిసి పట్టుకోవాల్సిందే. ప్రతి ఐదెకరాలకు ఒక ఫాంపాండ్ తవ్వుకోవాలి. పడే వర్షంలో పదిశాతం మాత్రమే భూగర్భ జలాలుగా మారుతాయి. జిల్లా వ్యాప్తంగా 96 పిజో మీటర్లు ఏర్పాటు చేసి, భూగర్భజలాలను పర్యవేక్షిస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలో 10.17 మీటర్ల లోతులో నీరున్నాయి. మేనెలలో మరింత లోతుకు వెళ్లే ప్రమాదముంది. గత ఏడాది 17 మీటర్ల లోతులో నీరుండగా, ఈఏడాది మరింత లోతుకు వెళ్లే అవకాశముంది.

-మల్లికార్జునరావు, డిప్యూటీ డైరెక్టర్, గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంటు, శ్రీసత్యసాయి జిల్లా

భవిష్యత్తుకు ప్రమాదం



జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒకరు నీటి సంరక్షణ చర్యలు చేపట్టకపోతే, భవిష్యత్ తరాలకు ప్రమాదమే. ఇప్పటికే ఉపాధి హామీ పథకం ద్వారా ఫాంపాండ్లు, ఇంకుడు గుంతలు, ట్రెంచ్‌ల నిర్మాణం, పండ్లతోటల పెంపకం, వాటర్‌షెడ్ కార్యక్రమాలు, అమృత్ సరోవర్ లాంటి కార్యక్రమాల ద్వారా సహజ వనరుల సంరక్షణకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాం. జిల్లాలో వివిధ పథకాల ద్వారా ఈ ఏడాది 2.72 టీఎంసీల నీటిని భూమిలోకి ఇంకింపజేశాం. ప్రతి ఒకరు నీటిని పొదుపుగా వాడాలి.

-విజయప్రసాద్, ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా నీటియజమాన్య సంస్థ

సహజ వనరులను సంరక్షించాలి



జిల్లాలో ఉపాధి పథకం, వాటర్ షెడ్ కార్యక్రమాల ద్వారా నీటి సంరక్షణ కోసం కృషి చేస్తున్నారు. సహజ వనరుల సంరక్షణద్వారానే భూగర్భజలాలను పెంపొందించవచ్చు. మా సంస్థ ద్వారా మొగిలిచెట్ల తండా వద్ద 210 ఎకరాల్లో అడవులను కాపాడటం ద్వారా నీటి సంరక్షణకు కృషి చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా సామాజిక కట్టుబాట్లను తీసుకు వచ్చి అడవుల పెంపకం చేపడితే భూగర్భజలాలు పెరుగుతాయి. నీటిని ఉమ్మడి వనరుగా ప్రకటించాలి. భూగర్భ జలాలు వాడుకుంటున్న ప్రతి ఒకరు నీటిని భూమిలోకి నీటిని ఇంకించేలా కార్యక్రమాలు చేపట్టాలి.

- బలరాం, సీఈఓ, జనజాగృతి సంస్థ

గొంతెండుతున్న గ్రామాలు

అనంతపురం జిల్లాలో పలు గ్రామ పంచాయతీలు వేసవి ప్రారంభంలోనే తాగునీటి కోసం అల్లాడిపోతున్నాయి. అనంతపురం రూరల్ మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నట్లు అధికారులు నివేదికలు తయారు చేశారు. ఇక్కడ 66 వేలకు పైగా జనాభా ఉంది. జిల్లాలోని 31 మండలాల్లోని 130 గ్రామాల్లో నీటి ఎద్దడి ఉన్నట్లు అధికారులు నివేదిక తయారు చేశారు. ఈ వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడని ఎదుర్కొనేందుకు రూ.5.87 అవసరం అవుతుందని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.



నీటి ఎద్దడి తలెత్తే పంచాయతీలు...

అనంతపురం రూరల్‌లో 16, బుక్కరాయసముద్రం మండలంలో 6 , శింగనమల 9, గార్లదిన్నె4, కంబదూరు 12, పుట్లూరు6, నార్పలలో 8, గుంతకల్లు6, గుత్తి 6, ఆత్మకూరు 6, కూడేరు 5, విడపనకల్లు 5, యల్లనూరు 8, కుందుర్పి 5, శెట్టూరు 5, బ్రహ్మసముద్రం 3, కళ్యాణదుర్గం 8, ఉరవకొండలో 4 పంచాయతీలకు సంబంధించి 130 గ్రామాల్లో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్నట్లు అధికారులు నివేదికలు పంపారు.

ప్రజలకు సమ్మె గుబులు...?

జిల్లా ప్రజల తాగునీటి అవసరాలను సత్యసాయి, శ్రీరామిరెడ్డి ప్రాజెక్టు లు తీరుస్తున్నాయి. అయితే ఇందులో పని చేస్తున్న కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడైనా సమ్మె చేపట్టే అవకాశం ఉండటం గుబులు రేపుతోంది. అధికారులు గాని, ప్రజప్రతినిధులు గాని వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారు. కార్మికులు సమ్మె చేసినప్పుడు మాత్రం హడావుడి చేసే అధికారులు ఆనక పట్టించుకో వడం లేదు. దీంతో ఈ ప్రాజెక్టుల పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు ఈ వేసవిలో తాగునీటి సమస్య లేకుండా గడిచిపోతే చాలని ఎదురుచూస్తున్నారు.



రైతులకు నీటివాడకంపై అవగాహన కార్యక్రమం



నీటి నిల్వ కోసం తనకల్లు వద్ద తవ్విన ఫాంపాండ్

షాక్ కొడుతోంది..!

జిల్లా విద్యుత్ శాఖలో ఏఈఈల కొరత

- జిల్లా కేంద్రంలోని డి-4 విద్యుత్తు సెక్షన్‌కు ఏఈఈ లేక నెలలు గడుస్తోంది. ఈనేపథ్యంలో డి-1 సెక్షన్ ఏఈఈకి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. డి-5సెక్షన్ పరిస్థితి ఇలాగే ఉంది. స్థానికంగా ఏఈఈ లేకపోవడంతో ఆత్మకూరు మండలం ఏఈఈకి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఉన్న విధులతోనే సతమతమవుతుంటే అదనపు బాధ్యతలు కేటాయించడంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- శింగనమల మండలానికి కొన్ని నెలలుగా ఏఈఈ లేరు. తాడిప్రతిలో పనిచేస్తున్న జూనియర్ ఇంజనీర్‌కు శింగనమల ఏఈఈ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. వజ్రకరూరుకు ఏఈఈ లేకపోవడంతో గుంతకల్లులో పనిచేస్తున్న జూనియర్ ఇంజనీర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. యాడికి మండలానికి తాడిపత్రిలోని డి-1సెక్షన్‌లో పనిచేసే జూనియర్ ఇంజనీర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఇలా ఏఈఈలు లేకపోవడంతో జూనియర్ ఇంజనీర్లే జిల్లా విద్యుత్తు శాఖకు దిక్కుగా మారారు.

• 30శాతం పోస్టులు ఖాళీ • ఆయా స్థానాల్లో జూనియర్ ఇంజనీర్లే దిక్కు • పని ఒత్తిడిలో సిబ్బంది.. సేవలపై ప్రభావం



జిల్లా విద్యుత్తు శాఖ కార్యాలయం

అనంతపురంరూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు శాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు లేకపోవడంతో పాలన కుంటు పడింది. జిల్లా వ్యాప్తంగా 40శాతం వరకు ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈఈల కొరత కారణంగా ఆయా కార్యాలయాలు, పక్క ప్రాంతాలు, సెక్షన్లలో పనిచేసే జూనియర్ ఇంజనీర్లే విద్యుత్ శాఖకు దిక్కుగా మారారు. ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువశాతం ఏఈఈల కంటే జూనియర్ ఇంజనీర్లే విధులు నిర్వహిస్తున్నారు. ఆ ప్రభావం విద్యుత్ సేవలపై పడుతోంది.

సేవలపై ప్రభావం

క్షేత్రస్థాయిలో పనిచేసే ఏఈఈలు లేకపోవడంతో సంబంధిత కార్యాల యాల్లో పాలన అధ్వానంగా తయారైంది. ఇన్‌చార్జులుగా నియమితులైన వారు తమ సెక్షన్ల పనులు చూసుకునే సరికే రోజులు గడిచిపోతున్నాయి, ఈనేపథ్యంలో ఇన్‌చార్జులుగా ఉన్న కార్యాలయాలకు అప్పుడప్పుడూ వెళ్లి వస్తున్నారు. దీంతో ఆయా సెక్షన్లతో పాలన కుంటుపడుతోంది. ఆ ప్రభావం కాస్తా వినియోగదారులకు అందే సేవలపై పడుతోంది. జిల్లా వ్యాప్తంగా గృహ కనెక్షన్లు 6,17,598 ఉన్నాయి. కమర్షియల్ కనెక్షన్లు 72,061, ఇండస్ట్రీస్ 3,530, తాగునీటి కనెక్షన్లు, వీధి దీపాలకు సంబంధించి కనెక్షన్లు 12,803, వ్యవసాయ కనెక్షన్లు 1,84,542 కనెక్షన్లు ఇలా మొత్తం 8,90,534 కనెక్షలున్నాయి. వీటికి సంబంధించి ఏవైనా సమస్యలు వచ్చిన ఏఈఈలు వెళ్లాల్సిందే. వీటితో పాటు న నా త న సర్వీసుల కోసం వినియోగదారులు, రైతులు కచ్చితంగా సంబంధిత కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే స్థానికంగా అధికారులు లేకపోవడంతో రైతులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

జూనియర్ ఇంజనీర్లే దిక్కు


జిల్లాలో ఏఈఈల కొరత కారణంగా ఉన్నతాధికారులు ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 68 ఏఈఈ పోస్టులు ఉంటే అందులో 20 ఖాళీగా ఉన్నాయి. వీటిలో 12మంది జూనియర్ ఇంజనీర్లు ఇన్‌చార్జులుగా పనిచేస్తుండటం గమనార్హం. ఏఈఈ లేకపోవడంతో ఉన్నతాధికారులు చాల చోట్ల జూనియర్ ఇంజనీర్లకు అదనపు బాధ్యత లు అప్పగించి పనులు చేయించుకుంటున్నారు. వాస్తవానికి జూనియర్ ఇంజనీర్లు డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో పనిచేయాల్సి ఉంటుంది. జూనియర్ ఇంజనీర్లు తమ విధులు నిర్వర్తిస్తూనే స్థానిక సెక్షన్ పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. వీరికే ఇన్‌చార్జ్ ఏఈఈ బాధ్య తలు అప్పగించారు. కొంత మంది ఏఈఈలు తాము పనిచేసే సెక్షన్‌తో పాటు ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తున్న సెక్షన్‌లోని వాటిని పర్యవేక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో రోజువారిగా ఉన్నతా ధికారులు నిర్వహించే టెలీకాన్ఫరెన్స్‌లు, ప్రజాప్రతినిధుల సమావేశాలు, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం ఇతరత్రవాటితో తలమునకలవు తున్నారు. ఒక్కొక్క ఏఈఈ 12వేల నుంచి 15వేల సర్వీసులను పర్యవేక్షించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 45వేల నుంచి 50వేల సర్వీసులను పర్యవేక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

సమస్యలు తతెత్తకుండా చర్యలు



జిల్లాలో ఏఈఈల కొరతను సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఏఈఈల కొరత కారణంగా ఆయా స్థానాల్లో సమీపంలోని ఏఈఈలు, జూనియర్ ఇంజనీర్లకు బాధ్యతలు అప్పగించాం. ఇదే క్రమంలోనే వినియోగదారులు, రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నాం.

- శేషాద్రి శేఖర్, ఎస్ఈ, విద్యుత్తు శాఖ, అనంతపురం జిల్లా



జిల్లా కేంద్రంలోని డి-5 సెక్షన్ ఏఈఈ కార్యాలయం

అటవీ భూముల పరిరక్షణకు ప్రాధాన్యం

జిల్లా అటవీ శాఖాధికారి విఘ్నేష్



అనంతపురం న్యూటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అటవీ భూముల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్ఓ) విఘ్నేష్ పేర్కొన్నారు. జిల్లాలోని 94 రిజర్వ్ ఫారెస్ట్ (ఆర్ఎఫ్) బ్లాకులకు జియో ట్యాగింగ్ చేయించి, హద్దులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 88 బ్లాకులను పూర్తి చేశామన్నారు. అటవీస్థలాల్లోకి ఎవరూ అక్రమంగా ప్రవేశించకుండా చర్యలు చేపడతామంటున్న ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

ఇంటర్వ్యూ interview

ప్రశ్న: వన్యప్రాణుల సంరక్షణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు: వేసవిలో వన్యప్రాణులు దాహంతో జనారణ్యంలోకి వస్తుంటాయి. వాటిని సంరక్షించడంలో భాగంగా సాసర్ పిట్స్‌లో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతాం. జిల్లాలో 35 సాసర్ పిట్స్ ఉన్నాయి. సాసర్ పిట్స్ స్థానంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయించి, అక్కడ నీరు నిలువ ఉండేలా చర్యలు చేపడతాం. వన్యప్రాణులకు.. అడవిలోనే తగిన తిండి లభ్యమయ్యేలా ఫలాలను ఇచ్చే మొక్కలను పెంచుతాం.

ప్రశ్న: నర్సరీల అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు: జిల్లాలో పచ్చదనం పెంపొందించే దిశగా చర్యలు చేపడుతున్నాం. నర్సరీల్లో 4.8 లక్షల మొక్కలు అందుబాటులోకి ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుతం 3.8 లక్షల మొక్కలు అందుబాటులోకి వచ్చేలా విత్తనం సిద్ధం చేశాం. జూన్ నాటికి అన్నీ సమకూర్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: వన్యప్రాణుల నుంచి పంటలు నష్టపోతున్న రైతులను ఎలా ఆదుకుంటారు?

జవాబు: వన్యప్రాణుల నుంచి పంటలు నష్టపోతే సంబంధిత రైతుకు పరిహారం అందజేస్తాం. ఇప్పటి వరకు రూ.3 లక్షలు పరిహారం అందించాం. మరో రూ.1.5 లక్షలు చెల్లించాల్సి ఉంది. అర్హులైన వారికి త్వరలోనే పరిహారం అందిస్తాం.

ప్రశ్న: వేసవిలో అగ్ని నుంచి అడవులకు ఎలా రక్షిస్తారు?

జవాబు: జిల్లాలో అగ్ని నుంచి అడవులను కాపాడటం సవాల్‌గా మారింది. ఎన్ని జాగ్రత్తలు చేపట్టినా ఏదో ఒక ప్రాంతంలో అడవిలో అగ్గి పడతూనే ఉంది. వీటిని మానిటరింగ్ చేయడానికి వేసవిలో ప్రతి రేంజ్‌కు ప్రత్యేకంగా నలుగురు ఫైర్ వాచర్స్‌ను నియమించాం. వీరు గ్రామాల్లో తిరుగుతూ.. అడవిలోకి ఎవరు వెళ్తున్నారు, వారి వివరాలు నమోదు చేస్తున్నారు. అడవిలో ఎక్కడ అగ్గి పడినా సమాచారం ఇవ్వాలి. తద్వారా వెంటనే అదుపు చేసే అవకాశం ఉంటుంది.

వెంటనే విధుల్లో చేరాలి

అనుమతి లేకుండా దీర్ఘకాలిక సెలవులో వెళ్లడం సరికాదు

ఆ పోస్టును ఇతరులతో భర్తీ చేస్తాం

వైద్య సిబ్బందికి డీసీహెచ్ఎస్ హెచ్చరిక


రికార్డులను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్

గుంతకల్లు, మార్చి21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో అనుమతులు తీసుకోకుండానే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినవారు వెంటనే విధుల్లో చేరాలని డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ ఆదేశించారు. లేదంటే వారి స్థానంలో మరొకరిని నియమిస్తామని హెచ్చరించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిని శుక్రవారం డీసీహెచ్ఎస్ తనిఖీచేశారు. అనుమతులు లేకుండా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన వైద్యులు, సిబ్బందితో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. నెలలకొద్దీ సెలవు ఇచ్చే అధికారం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు లేదన్నారు. తన అనుమతి లేకుండా ఇష్టానుసారంగా సెలవుపై వెళితే గుంతకల్లు లాంటి పెద్ద ఆస్పత్రిలో ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. వెంటనే వచ్చి విధుల్లో చేరకుంటే ఇతరులను ఆ పోస్టుల్లో నియమిస్తామని స్పష్టంచేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గుంతకల్లు ఏరియా ఆస్పత్రిలో బెడ్లు, సిబ్బందిని పెంచి జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ అజేంద్రరావు పాల్గొన్నారు.


కూలిన వంతెనల పరిశీలన


దర్గాహొన్నూరు వద్ద వంతెనను పరిశీలిస్తున్న అధికారులు

బొమ్మనహాళ్/కణేకల్లు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల పరిధిలోని దర్గాహొన్నూరు, మీనహళ్లి, మాల్యం గ్రామాల పరిధి 169, 165, 155 కి.మీ.ల వద్ద తుంగభద్ర ఎగువ కాలువపై కూలిన వంతెనలను అనంతపురం హెచ్చెల్సీ ఈఈ రమణారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. 105 కి.మీ. నుంచి 189 కి.మీ. వరకు 10 పనులకు రూ.34.95 కోట్లతో పనులు చేపడుతున్నామన్నారు. రెండు, మూడురోజుల్లో హెచ్చెల్సీ అత్యవసర పనులు ప్రారంభమవుతాయన్నారు. జూలై నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కణేకల్లు డీఈఈ మద్దిలేటి, జేఈఈ అల్తాఫ్ పాల్గొన్నారు.

అనంత అభివృద్ధికి మరిన్ని నిధులివ్వాలి

పార్లమెంటులో ఎంపీ అంబికా వినతి


మాట్లాడుతున్న ఎంపీ అంబికా

అనంతపురం అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి కేంద్రం మరిన్ని నిధులు కేటాయించాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. శుక్రవారం పార్లమెంటులో జలశక్తి మంత్రిత్వ శాఖ కు మంజూరైన నిధులపై చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. 2025-26 బడ్జెట్‌లో జలశక్తి మంత్రిత్వశాఖకు రూ.99,503 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. అత్యల్ప వర్షపాతం నమోదయ్యే అనంత జిల్లాలో రైతులు తీవ్ర నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లపై సబ్సిడీ పెంచాలని కోరారు. అనంతపురాన్ని గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా ప్రత్యేక నిధులివ్వాలన్నారు. రైతులకు ఉచితంగా సోలార్ పంపులను అందించే అవకాశాలను పరిశీలించాలని ఎంపీ కోరారు.

నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

అనంతపురం విద్య, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు శనివారం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో ఆర్థిక, ప్రణాళిక సంఘం, వర్కులు, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యసేవలు స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఉంటాయన్నారు. అదనపు సమావేశ మందిరంలో మహిళా, శిశుసంక్షేమం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈఓ తెలిపారు.

పోలీసుల అదుపులో నకిలీ నోట్ల ముఠా

బ్రహ్మసముద్రం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నకిలీ నోట్లు చెలామణీ చేస్తున్న ముగ్గురిని బ్రహ్మసముద్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మండలంలోని పిల్లలపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు రూ.50 వేల విలువైన నకిలీ నోట్లను కర్ణాటక ప్రాంతానికి చెందిన మొక్కజొన్న వ్యాపారికి అంటగట్టినట్లు తెలిసింది. కర్ణాటక వ్యాపారి వద్ద నకిలీ నోట్లు ఉన్నట్లు సమాచారం అందడంతో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిసింది. అతడిచ్చిన సమాచారం మేరకు పిల్లలపల్లికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు సమాచారం. సుమారు రూ.50 లక్షలకు పైబడి నకిలీ నోట్లు ఉన్నట్లు తెలుస్తోంది.

యువతకు ఉపాధి శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల యోజన కింద నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిహార్‌స్కిల్స్ అడ్మిషన్ల సమన్వయకర్త హరిప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లిష్, లైఫ్ స్కిల్స్‌పై నాలుగు నెలలపాటు కడపలో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 9000487423 నంబరులో సంప్రదించాలని కోరారు.

దేవేరుల అలక తీర్చిన శ్రీవారు

ఆకట్టుకున్న అలకోత్సవం

అశ్వవాహనంపై ఖాద్రీశుడి దర్శనం


అశ్వవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

కదిరి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగమైన అలకోత్సవాన్ని శుక్రవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని ఆలయ ఈఓ, ఉపకమిషనర్ వి. శ్రీనివాసరెడ్డి నివాసం వద్ద నిర్వహించారు. కల్యాణోత్సవం నాటి నుంచి రోజుకో వాహనంపై ఊరేగుతూ భక్తులను తప్ప తమను పట్టించుకో వడం లేదంటూ శ్రీదేవీ, భూదేవీ అమ్మవార్లు అలక పాన్పు ఎక్కడం, వారిని శ్రీవారు అనుయించే ఘట్టాలే అలకోత్సవం. అమ్మవార్ల తరుఫున ఈఓ వకాల్తాపుచ్చుకోగా శ్రీవారు, అమ్మవార్ల మధ్య సంభాషణను ఆలయ అర్చకులు భక్తులకు విన్పించడం ఈ ఉత్సవ ప్రత్యేకత. సృష్టిలో సర్వమూ తానేనని, లోకకల్యాణార్థమే తాను భక్తుల చెంతకు వెళ్తున్నాని, శ్రీవారు నచ్చచెప్పడంతో అమ్మవార్లు శాంతించి యాగశాల ప్రవేశం గావించారు. ఈ ఉత్సవానికి ఆలయ ఈఓ ఉభయదారులుగా వ్యవహరించి శ్రీవారు, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. పట్టణంలోని ప్రముఖులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు ఈ ఉత్సవాన్ని వీక్షించారు. అలకోత్సవం అనంతరం శ్రీవారు అశ్వవాహనంపై కొలువుతీరి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పదిహేను రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు విజయవంతం అయ్యాయని చాటి చెప్పేందుకే శ్వేత అశ్వవాహనం పై దర్శనమిచ్చారు.

నేడు తీర్థవాది

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తీర్థవాది జరగనుంది. ఉత్సవాలకు అంకురార్పణ జరిగిన నాటి నుంచి యాగశాలలోనే కొలువు తీరిన శ్రీవారు శనివారం ఆలయప్రవేశం చేయనున్నారు. ఈ ఉత్సవంలో భాగంగా ఉదయం నిత్య పూజల అనంతరం శ్రీదేవి, భూదేవిల సమేత శ్రీవారు ఆలయప్రాంగణంలో కొలువుతీరుతారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, భక్తులు అన్న భేదం లేకుండా అందరూ రంగులు చల్లుకుని వసంతోత్సవాలు జరుపుకుంటారు. అనంతరం దేవేరుల సమేత శ్రీవారిని ఆలయానికి పడమర దిక్కున ఉన్న భృగుతీర్థం వరకు ఊరేగిస్తారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ భృగుతీర్థంలో శ్రీచక్ర స్నానం, అభిషేకాలు నిర్వహించిన అనంతరం తిరువీధుల గుండా ఆలయ ప్రవేశం గావిస్తారు. అనంతరం ప్రధాన ద్వారాలు మూసివేసి అన్నిరకాల దర్శనాలను రద్దు చేస్తారు. పునః దర్శనం ఆదివారం ఉదయమే.

తాడిపత్రిలో ఉద్రిక్తత

వైసీపీ నాయకుడు ఫయాజ్‌బాషా ఇంటి నిర్మాణంపై వివాదం

అనుమతి లేదని కూల్చి వేసేందుకు వెళ్లిన మున్సిపల్ అధికారులు

కోర్టు పరిధిలో ఉందని అభ్యంతరం చెప్పిన ఫయాజ్‌బాషా

జేసీ ప్రభాకర్ రెడ్డి అక్కడికి వెళ్లడంతో వాగ్వాదం

ఫయాజ్ ఇంటిపై రాళ్లదాడి.. వాహనం ధ్వంసం


అడిషినల్ ఎస్పీతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి



ఫయాజ్‌బాషా ఇంటి నిర్మాణాన్ని కూల్చివేయడానికి తీసుకువచ్చిన హిటాచి

తాడిపత్రి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం ఉద్రిక్తత తలెత్తింది. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా అనుమతికి మించి ఇంటిని నిర్మించారని కూల్చివేసేందుకు మున్సిపల్ అధికారులు వెళ్లారు. వారితోపాటు మున్సిపల్ కౌన్సిలర్లు కొందరు వెళ్లారు. ఈ క్రమంలో వాగ్వాదం జరగడం, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అక్కడికి వెళ్లడంతో పరిస్థితి అదుపు తప్పింది. ఫయాజ్ బాషా ఇంటిపై రాళ్ల దాడి జరిగింది. తాడిపత్రి చిన్నబజారులో ఫయాజ్ బాషా ఇల్లు నిర్మించారు. కానీ అనుమతి తీసుకున్న ప్లాన్‌కంటే ఎక్కువ నిర్మాణం చేపట్టారని మున్సిపల్ అధికారులు, టీడీపీ కౌన్సిలర్లు ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేసేందుకు వెళ్లారు. తనకు అన్ని అనుమతులు ఉన్నాయని, కోర్టును కూడా ఆశ్రయించానని ఫయాజ్ అభ్యంతరం తెలిపారు. పై అంతస్తుకు మాత్రమే అనుమతి లేదని, అనుమతి కోరానని అన్నారు. అలాంటప్పుడు తన ఇంటిని ఎలా కూల్చివేస్తారని ఆయన ప్రశ్నించారు. కోర్టు ఇచ్చిన పత్రాలను వారికి చూపించారు. వివాదం నేపథ్యంలో అడిషనల్ ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాల వాదన విని, కోర్టు పరిధిలో ఉన్నందునూ ఎవరూ ఏమీ చేయవద్దని సూచించారు. దీనికి మున్సిపల్ అధికారులు ఒప్పుకోలేదు. ప్లాన్ అనుమతులు తక్కువగా తీసుకున్నాడని, ఇలాగే విడిచిపెడితే ఎలా అని ఏఎస్పీతో వాదించారు. కోర్టు పరిధిలో ఉండగా నిర్మాణాన్ని ఎలా పూర్తిచేస్తారని, ఇంట్లోకి ఎలా చేరుతారని మున్సిపల్ అధికారులు ఫయాజ్‌బాషాను ప్రశ్నించారు. ఇకపై ఎలాంటి పనులు చేయబోమని రాసివ్వాలని కోరారు. దీనికి ఆయన నిరాకరించారు. ఈ క్రమంలో రెండు వర్గాలవారు జనసమీకరణ చేసుకున్నారు. దీంతో పోలీసులు నచ్చజెప్పి చాలామందిని అక్కడి నుంచి పంపించివేశారు. ఆ తరువాత మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వస్తాడని మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు అక్కడే మకాం వేశారు. కాసేపటికి జేసీ ప్రభాకర్‌రెడ్డి అక్కడికి రావడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు అప్రమత్తమై ఇరువర్గాలతో మాట్లాడినా ప్రయోజనం లేకపోయింది. మాటమాట పెరగడంతో ఫయాజ్ బాషా ఇంటిపైకి ఒక్కసారిగా రాళ్ల వర్షం కురిపించారు. దీంతో స్థానికులు భయాందోళకు గురయ్యారు. పరిస్థితి చేయి దాటిపోవడంతో ఫయాజ్‌బాషాను పోలీసులు జీపులో తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఫయాజ్‌బాషా ఇంటి అద్దాలు పగిలిపోయాయి. ఆయన వాహనం ధ్వంసమైంది. దాడి అనంతరం పోలీసులు జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన వర్గీయులను అక్కడి నుంచి పంపించివేశారు. ముందుజాగ్రత్త చర్యగా పెద్దవడుగూరు, యాడికి, పుట్లూరు సీఐలు, ఎస్ఐలు, సిబ్బందిని తాడిపత్రికి రప్పించారు. తాడిపత్రి పట్టణ సీఐ సాయిప్రసాద్, రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మెడికల్ షాపులపై దాడులు

ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్ముతున్నట్లు గుర్తింపు

చర్యలకు సిఫార్సు చేస్తామన్న విజిలెన్స్ అధికారులు


అనంతపురంలోని ఉమాదేవి మెడికల్ షాపులో తనిఖీలు


హిందూపురంలోని మెడికల్‌షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఈగల్ టీం

అనంతపురం టౌన్/హిందూపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ గరుడలో భాగంగా ఉమ్మడి జిల్లాలో మెడికల్ ఏజెన్సీలు, దుకాణాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఐజీ రవిప్రకాష్, ఈగల్ టీం ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, సీఐలు జమాల్ బాషా, సద్గురుడు, ఏఓ వాసుప్రకాష్, డీసీటీఓ సురేష్‌కుమార్, డ్రగ్స్ శాఖ అసిస్టెంట్ డైరెక్టరు రమేష్ రెడ్డి బృందంగా ఏర్పడి దాడులు నిర్వహించారు. అనంతపురం నగరంలోని ఉమాదేవి, న్యూ సుభాన్, కేశవ్, రూపా మెడికల్ షాపులలో తనిఖీలు చేశారు. ఈ దుకాణాలలో ఎన్‌ఆర్‌ఎక్స్ (మత్తు కలిగించేవి) మందులను నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్నట్లు గుర్తించారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా వీటిని విక్రయించకూడదు. కానీ రోగులు నేరుగా వచ్చి అడిగినా వీటిని అమ్ముతున్నట్లు గుర్తించామని డీఎస్పీ నాగభూషణం, డ్రగ్స్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టరు రమేష్ రెడ్డి తెలిపారు. ఈ దుకాణాలపై చర్యలకు సిఫార్సు చేస్తామని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని మెడికల్ షాపులు, ఏజెన్సీలపై దాడులు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఉన్న నాగశ్రీ మెడికల్‌షాపులో కాలం చెల్లిన మందులను అమ్ముతున్నట్లు గుర్తించారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే మత్తు మందులను అమ్ముతున్నట్లు గుర్తించారు. ఈ మెడికల్ షాపును సీజ్ చేయాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని విజిలెన్స్ సీఐ సద్గురుడు తెలిపారు. పెనుకొండలోని రెండు ప్రధాన మెడికల్ షాపుల్లో బిల్లులు లేకుండా మందులు ఇస్తున్నట్లు గుర్తించారు. వీరికి జరిమానా విధించాలని నివేదిక పంపుతామని సీఐ తెలిపారు.

జిల్లాలో ఆధ్యాత్మిక నగరం

50 ఎకరాల్లో నిర్మాణానికి నిర్ణయం

300 అడుగుల శివలింగం.. 108 అడుగుల విష్ణుమూర్తి విగ్రహం

3 నెలల్లో శంకుస్థాపన.. ఐదేళ్లలో నిర్మాణం

ఆధ్యాత్మిక మందిరాల రూపకర్త డీఎన్‌వీ ప్రసాద్ స్తపతి



మాట్లాడుతున్న డీఎన్‌వీ ప్రసాద్ స్తపతి

అనంతపురం కల్చరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆధ్యాత్మిక నగరం నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు ఆధ్యాత్మిక మందిరాల రూపకర్త డీఎన్‌వీ ప్రసాద్ స్తపతి తెలిపారు. జిల్లాను సనాతన సిద్ధాంతాలకు వేదికగా మారుస్తూ నార్పల క్రాస్ వద్ద 50 ఎకరాల విస్తీర్ణంలో ఆధ్యాత్మిక నగరాన్ని రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. దీనిపై జిల్లాకేంద్రంలోని సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. డీఎన్‌వీ ప్రసాద్ స్తపతి మాట్లాడుతూ.. దేశంలో సనాతన ధర్మానికి స్వర్ణయుగం ప్రారంభమైందన్నారు. ప్రపంచం భారతదేశం వైపు చూసేలా ఆధ్యాత్మిక మందిరాల స్థాపన జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా నార్పల క్రాస్ వద్ద 300 అడుగుల ఎత్తులో పంచముఖ శివలింగం, 108 అడుగుల ఎత్తుగల శ్రీమహావిష్ణుమూర్తి విగ్రహం ఏర్పాటు చేయదలిచామన్నారు. ఆలయాల నిర్మాణం, అభివృద్ధికి ప్రభుత్వాలు ముందుకు వస్తుండడం శుభపరిణామమన్నారు. ఆధ్యాత్మిక సంఘాలతోపాటు భక్తుల సమన్వయంతో నార్పల క్రాస్ వద్ద ఆధ్యాత్మిక నగరం ఏర్పాటుకోసం 50 ఎకరాల స్థలాన్ని సమీకరించామన్నారు. అందులో 25 ఎకరాల విస్తీర్ణంలో హరిహర మందిరం ఉంటుందన్నారు. గ్రామం-గుడి-బడి అనే సంకల్పంతో దీనిని చేపట్టినట్లు తెలిపారు. మందిరం కాకుండా మిగిలిన స్థలంలో ఆధ్యాత్మిక భావజాల భక్తుల నివాసాలు, హిందూ సనాతన ధర్మంతో కూడిన విద్యను అందించేలా పాఠశాల నిర్మాణాలు చేపడతామన్నారు. పాఠశాలలో సాధారణ పాఠాలతోపాటు భగవద్గీత, భాగవతం వంటివి బోధిస్తామన్నారు. 3 నెలల్లోపు శంకుస్థాపన చేసి, ఐదేళ్లలో మొత్తం నిర్మాణాన్ని పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. కార్యక్రమంలో తిరుపతి గోవింద పీఠం రామప్రియ యతీంద్రస్వామి, శ్రీనివాస్ స్తపతి, పెంచల ప్రసాద్ స్తపతి, ఇస్కాన్ మందిర చైర్మన్ దామోదర్ గౌరంగదాస్, టీటీడీ హిందూధర్మప్రచార పరిషత్ సభ్యుడు శ్రీపాద వేణు, చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి రంగారెడ్డి పాల్గొన్నారు.

ఒకే పోస్టుకు ఇద్దరు అధికారులు..!

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఒకే పోస్టుకు ఇద్దరు అధికారులను నియమించారు. దీంతో ఆన్‌సెట్ సీఈఓ అధికారి నియామకం వివాదంగా మారింది. జీఓ నంబరు 61ను రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి వినయచంద్ శుక్రవారం జారీ చేశారు. ఉత్తర్వుల ప్రకారం వెయిటింగ్‌లో ఉన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవిశంకర్ రెడ్డిని అనంతపురం ఆన్‌సెట్ సీఈఓ, జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారిగా నియమించారు. మరోవైపు టూరిజం రీజనల్ డైరెక్టర్‌గా ఉన్న వెంకటేశ్వర్లుకు ఆన్‌సెట్ సీఈఓ, జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ గత అక్టోబరులోనే ఉత్తర్వులు జారీ చేశారు. కాగా యూత్ కల్చరల్ స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ ప్రధాన కార్యదర్శి వినయ్‌చంద్ రెండో సారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. దీంతో ఈ పోస్టులో ఇప్పటికే ఉన్న వెంకటేశ్వర్లు కొనసాగుతారా లేక కొత్తగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవిశంకర్ రెడ్డి చేరుతారా అన్న విషయంలో ఉత్కంఠ నెలకొంది.

మీ సేవలు అమూల్యం..!

ఉమ్మడి జిల్లాలో పలువురికి ఉగాది పురస్కారాలు

జాబితాలో పోలీసు, ఫైర్, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది


విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం


స్పెషల్ బ్రాంచ్ సీఐ ధరణికిషోర్


ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్

అనంతపురం క్రైం/పుట్టపర్తి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పలువురు అధికారు లు, సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాలకు ఎంపిక చేసింది. పోలీసు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బందికి ఉత్తమ సేవా పతకాలు, సేవా పతకాలు వరించాయి.

ఉత్తమ సేవా పతకాలు

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ఎం.నాగభూషణం, అనంతపురం జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ జి.లోక్‌నాథ్‌చౌదరి, శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట ఎస్ఐ కోటకొండ రామమోహన్, 14వ బెటాలియన్ ఏఆర్ ఎస్ఐ వీసీఎస్ మహారాజు, 14వ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ వి.నారాయణస్వామి, అనంతపురం జిల్లా ఫైర్‌స్టేషన్ డ్రైవర్ ఆపరేటర్ ఎం.నాగభూషణం ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు.

సేవా పతకాలు

అనంతపురం జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ కె.ధరణి కిషోర్, ఇటుకలపల్లి సీఐ హేమంత్ కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎన్.రమణారెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గోకులం విజయ్‌కుమార్, రొళ్ల పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ బి.చిన్న బాలాజి, ఏఆర్ ఎస్ఐ ఎస్.షౌకత్ అలి, శ్రీ సత్యసాయి జిల్లా డీసీఆర్‌బీ ఏఎస్ఐ నాచు సంజీవకుమార్, కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ అగస్టిన్ పాల్, ఎన్‌పీ కుంట పీఎస్ ఏఎస్ఐ ఎన్.మునే నాయక్, అనంతపురం జిల్లా ఏఆర్ ఎస్ఐ సీహెచ్ నాగేశ్వరరావు, పుట్లూరు పీఎస్ ఏఎస్ఐ పి.రాజశేఖర్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎ.నాగరాజు, కళ్యాణదుర్గం టౌన్ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.హరినాథ్‌బాబు, అనంతపురం రూరల్ పీఎస్ కానిస్టేబుల్ టిప్పుసుల్తాన్, ఉరవకొండ యూపీఎస్ కానిస్టేబుల్ ఎం.చంద్రశేఖర్, ఏఆర్ పీసీ సి.రాముడు, అనంతపురం జిల్లా స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ ఏ.ప్రసన్నకుమార్, 14వ బెటాలియన్ ఏఆర్ ఎస్ఐ కె.వెంకటరామయ్య, ఏఆర్‌ఎస్ఐ ఎస్.రామక్రిష్ణ, 14వ బెటాలియన్ హెడ్‌కానిస్టేబుల్ బి.కోటేశ్వరరావు, ఏఆర్ ఎస్ఐ టి.హరినంద, హెడ్ కానిస్టేబుల్ కె.కన్నయ్య, పీటీసీ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బి.పెద్ద రంగయ్య సేవా పతకాలకు ఎంపికయ్యారు. అగ్నిమాపక శాఖలో సేవా పతకానికి ఉరవకొండ ఫైర్ స్టేషన్ లీడింగ్ ఫైర్‌మాన్ లక్ష్మీనారాయణ, శ్రీసత్యసాయి జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ హేమంత్‌రెడ్డి, పెనుకొండ ఫైర్‌స్టేషన్ లీడింగ్ ఫైర్‌మాన్ సీవీ రంగనాథమ్ ఎంపికయ్యారు.

ఏపీ పోలీస్ సేవా పతకం

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హెడ్‌కానిస్టేబుల్ బీఎస్ చలం బాబు ఏపీ పోలీస్ సేవా పతకానికి ఎంపికయ్యారు.

కారులో లిఫ్ట్ ఇచ్చి.. కత్తితో బెదిరించి..!

కియ కారు డ్రైవర్‌ను దోచుకున్న తెలంగాణ యువకులు

పారిపోతుండగా పట్టుకున్న పోలీసులు



నిందితులు ఉపయోగించిన కారు

గోరంట్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కియలో పని చేసే కారు డ్రైవర్‌కు లిఫ్ట్ ఇచ్చిన తెలంగాణ యువకులు, అతన్ని కత్తితో బెదిరించి దోచుకున్నారు. కారులో పారిపోతుండగా టోల్ గేట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గోరంట్ల మండలం పుల్లగూర్లపల్లికి చెందిన నందకూమార్ కియ పరిశ్రమలో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. విధులకు వెళ్లేందుకు బుధవారం రాత్రి పాలసముద్రం కూడలిలో వేచి ఉన్నారు. అదే సమయంలో బెంగుళూరు వైపు నుంచి టీఎస్ 21 ఎఫ్0092 నంబర్‌గల కారు రావడంతో నందకుమార్ లిఫ్ట్ అడిగారు. వారు కారులో ఎక్కించుకుని, సోమందేపల్లి సమీపంలోని పాపిరెడ్డిపల్లి చెరువు వద్దకు తీసుకెళ్లారు. అక్కడ రోడ్డు పక్కన కారు ఆపి, నందకుమార్‌ను దూరంగా తీసుకెళ్లి కత్తితో బెదిరించారు. బ్యాగ్ లాకుని, డబ్బులు డిమాండ్ చేశారు. అతని వద్ద నగదు లేకపోవడంతో 'కారు ప్రమాదం జరిగిందని చెప్పి మీ బంధువులకు చెప్పి ఫోన్ పే చేయించుకో' అని సూచించారు. అలా పలువురు బంధువుల నుంచి నందకుమార్ ఫోన్‌పే చేయించుకున్న సొమ్మును డబ్బు లాగేసుకున్నారు. నందకుమార్ వద్ద రెండు ఏటీఎం కార్డులు ఉండటంతో.. డబ్బులు డ్రా చేయించడానికి కారులో కియ సమీపంలోని అమ్మవారిపల్లి ఏటిఎం వద్దకు తీసుకెళ్లారు. అలా మొత్తం రూ.75 వేలు దోచుకుని, ఏటీఎం వద్ద చర్చించుకుంటున్నారు. ఆ సమయంలో నందకూమార్ చాకచక్యంగా తప్పించుకుని ఏటీఎం సెక్యూరిటీ గార్డు వద్దకు పరుగులు తీశారు. దీంతో నలుగురు యువకులు వెంటనే కారులో ఎక్కి ఉడాయించారు. బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అనంతపురం జిల్లా మరూర్ టోల్ గేట్ వద్ద కారును గుర్తించి, నలుగురినీ పోలీసులు పట్టుకున్నారు. బాధితుడిని టోల్‌గేట్ వద్దకు పిలిపించి విచారించారు. ఆ యువకులు నలుగురూ తెలంగాణలోని జగిత్యాలకు చెందినవారని తేలింది. గోవాకు వెళ్లి డబ్బులన్నీ ఖర్చు చేశారని, అందుకే తిరుగు ప్రయాణంలో నందకుమార్‌ను దోచుకున్నారని తెలిసింది. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నామని గోరంట్ల సీఐ శేఖర్ తెలిపారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

9 మంది ఎన్నికల అధికారుల నియామకం

అనంతపురం విద్య, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఖాళీ అయిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు ఎన్నికల నిర్వహణ నిమిత్తం రెండు జిల్లాల కలెక్టర్లు ఎన్నికల అధికారులను నియమించారు. మొత్తం 9 మందిని నియమించారు. కణేకల్లు మండలానికి రిజిస్ట్రార్ భార్గవ్, కంబదూరుకు ఆత్మా పీడీ మద్దిలేటి, ఉరవకొండకు బీసీ వెల్ఫేర్ అధికారి కుష్బూకొఠారి, యల్లనూరుకు జిల్లా హార్టికల్చర్ అధికారి రఘునాథరెడ్డి, పెద్దపప్పూరుకు డిప్యూటీ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, రాయదుర్గానికి జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసయాదవ్, గాండ్లపెంట మండలానికి ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, రొద్దంకి డ్వామా పీడీ విజయప్రసాద్, రామగిరికి ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సంజీవయ్యను నియమించారు. ఈనెల 27న జిల్లావ్యాప్తంగా ఐదు ఎంపీపీ, నాలుగు వైస్ ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శనివారం సాయంత్రం)	సహర్ (ఆదివారం ఉదయం)
కదిరి:	6.31	5.04
ధర్మవరం:	6.36	5.04

నష్టాల మంటలు ఆరేదెన్నడో..?

- కలగా ముదిగుబ్బలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు
- ప్రతిపాదనలతోనే సరిపెట్టిన వైసీపీ ప్రభుత్వం
- ప్రస్తుత ప్రభుత్వంలోనైనా ఆ కల తీరేనా!


ముదిగుబ్బలో దగ్ధమైన నేరేడు చెట్లు

ముదిగుబ్బ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎండా కాలం.. తరచూ అగ్ని ప్రమాదాలు... సకాలంలో అగ్నిమాపక యంత్రం సంఘటన స్థలానికి వచ్చేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ముదిగుబ్బ, బుక్కపట్నం, బత్తలపల్లి మండలాలకు కలిపి.. కదిరిలో అగ్నిమాపక కేంద్రం ఉంది. కదిరికి 32 ముదిగుబ్బ కిలోమీటర్ల దూరం ఉంది. ఇక మండలంలోని సరిహద్దు గ్రామాల్లో ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే అంతేసంగతులే. ఫైర్ ఇంజన్ వచ్చే లోపు ఆస్తి మొత్తం కాలి బూడిద అవుతుంది. ఎండా కాలంలో గడ్డి బాగా ఎండి ఉండటంతో.. ఓ చిన్న నిప్పురవ్వ పడ్డా.. భారీ నష్టం తప్పదు. పొలాల్లో అగ్ని ప్రమాదాలు నివారించలేక ఈ మూడు మండలాలకు చెందిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉద్యానవన పంటలు, గడ్డివాములు, పశువుల కొట్టాలు తరచూ అగ్ని ప్రమాదాలకు గురవుతున్నాయి. బుక్కపట్నం, బత్తలపల్లి మండలాలకు అనువుగా ఉన్న ముదిగుబ్బలో అగ్ని మాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ఈ మండలాల రైతులు అనేక సంవత్సరాలుగా విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రైతులు, ప్రజలు, వామపక్షాల పార్టీ నాయకులు అనేక సార్లు ఈ సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలం చాలా ఉన్నప్పటికీ అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుపై పాలకులు దృష్టి సారించడం లేదు. దీంతో ప్రభుత్వాలు మారినా.. ఈ మండలాల రైతుల కల నెరవేరడం లేదు. ముదిగుబ్బలో అగ్నిమాపక కేంద్రం నిర్మాణం కలగానే మిగిలిపోతోంది. బుక్కపట్నం, బత్తలపల్లి మండలాలకు అనువుగా ఉన్న ముదిగుబ్బలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే ప్రమాదాల్లో నష్టం ఎక్కువ జరగకుండా నివారించవచ్చు.

గత ఫిబ్రవరిలో మద్దన్నగారిపల్లిలో నరసింహ యాదవ్‌కు చెందిన 80 మామిడి చెట్లు కాలిపోయాయి. మండల కేంద్రంలో మౌలాలికి చెందిన ఆరికలు, సాముల పంట దాదాపు మూడు ఎకరాలు పూర్తిగా కాలిపోయింది. వెంగమునికి చెందిన కందిపంట 2 ఎకరాలలో కాలిపోయింది. శ్రీనివాసులుకు చెందిన నేరేడు చెట్లు పూర్తిగా కాలిపోయాయి. ఇలా తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాప్రతినిధులు స్పందించి ముదిగుబ్బలో అగ్ని మాపక కేంద్రం మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.



ముదిగుబ్బలో ఏర్పాటు చేయాలి

కొన్నేళ్లుగా ముదిగుబ్బలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు అన్నది ఓ కలగానే మిగిలిపోతోంది. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు కదిరి నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చేందుకు చాలా సమయం పడుతోంది, అదే ముదిగుబ్బలో ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల రెండు మండలాలకు అనువుగా ఉంటుంది. అగ్ని ప్రమాదాల వల్ల ఎక్కువ నష్టం జరగకుండా నివారించవచ్చు.

-రాగిపాటి రామ్మోహన్, నల్లాయకుంటపల్లి



పాలకులు స్పందించాలి

ముదిగుబ్బలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని అనేక సంవత్సరాలుగా కోరుతున్నాం. ప్రభుత్వాలు.. పాలకులు.. అధికారులు మారుతున్నా.. ఆ కల మాత్రం నెరవేరడం లేదు. మారుమూల ప్రాంతాల్లో పశువుల కొట్టాలు, ఉద్యానవన పంటలు, గడ్డివాములకు మంటలు వ్యాపించినప్పుడు.. కదిరి నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చేలోగా పూర్తి నష్టం జరిగిపోతోంది. ముదిగుబ్బలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా ఈ ప్రభుత్వమైనా చర్యలు తీసుకోవాలి.

- కుర్రా వెంకటనాయుడు, గంగిరెడ్డిపల్లి

న్యూస్ బాక్స్

పన్నులు చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తాం

పుట్టపర్తి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి, నీటిపన్నులు సకాలంలో చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద్, ఆర్‌వి నరసింహులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో పన్నులు బకాయిలు దాదాపు రూ.7 కోట్ల వరకు ఉండగా 40 శాతం మాత్రమే వసూలైందని, లక్షల్లో బకాయిలు పడ్డవారు పన్నులు చెల్లించడంలో ఆసక్తి చూపడంలేదని అన్నారు. పన్నులు చెల్లించడానికి కేవలం 10 రోజులే మిగిలి ఉందని, అంతలోపు పన్నులు చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేయడంతో పాటు నీటి సరఫరాను, భూగర్భ డ్రైనేజీ కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరించారు.

ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోండి

తనకల్లు, మార్చి21 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ కొత్తగా ప్రమాద బీమా పథకాన్ని తీసుకొచ్చిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఆ బ్యాంక్ మేనేజర్ మురళీక్రిష్ణ తెలిపారు. 18 నుంచి 65 సంవత్సరాల లోపు వారు ఈ పథకానికి అర్హులని, సంవత్సరానికి రూ.రెండు వేలు చెల్లించాలని అన్నారు. సభ్యుడు ప్రమాదంలో.. పాము, తేలుకాటుతో.. ప్రకృతి వైపరీత్యాల్లో మరణిస్తే.. మృతుడి కుటుంబానికి రూ.40 లక్షలు బీమా చెల్లిస్తామన్నారు.

విశ్వకర్మ యోజన పనిముట్ల పంపిణీ


పనిముట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

ఓబుళదేవరచెరువు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ యోజనలో భాగంగా మండలంలోని 66 మంది తాపీ మేస్త్రీలకు బీజేపీ మండల అధ్యక్షుడు ఇడగొట్టు వీరాంజనేయులు స్థానిక తపాలా కార్యాలయం వద్ద శుక్రవారం పనిముట్లు అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సున్నంపల్లి రంగారెడ్డి, అశ్వర్థప్ప, మేకల వెంకటరమణ, ఆకుతోటపల్లి క్రిష్టప్ప పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

బత్తలపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలను సీఐ ప్రభాకర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఆయన పలు సూచనలు ఇచ్చారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

నల్లమాడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక మేదర వీధిలో నెలకున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డికి వినతిపత్రం అందించిన వారు మాట్లాడారు. మేదర వీధిలో నెల నుంచి నీటి ఎద్దడి ఉందని, పంచాయతీనీటితో పాటు సత్యసాయి నీటినీ అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో మండలకార్యదర్శి వెంకట రమణ, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె. చంద్ర, గంగాద్రి, సురేష్, మేదరవీధికి చెందిన మహిళలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షం

తనకల్లు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయడంపై దళిత సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో మందక్రిష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

● కదిరిఅర్బన్: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదంపై మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో మందక్రిష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

పనిభారం తగ్గించండి

తాడిమర్రి, మార్చి21(ఆంధ్రజ్యోతి): పనిభారం తగ్గించాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఎంపీడీఓ రంగారావును విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు వినతి పత్రం అందజేశారు. పంచాయతీరాజ్ పరిధిలోని 30 రకాల పనుల పర్యవేక్షణకే సమయం చాలడం లేదని, ఇక సచివాలయ సిబ్బందితో కలిసి మరో 20 రకాల సర్వేలు తమతో చేయించడం తగదని వాపోయారు. పనిఒత్తిడి పెరిగి సతమతమవుతున్నామని, పనిభారం తగ్గించాలని కోరారు.

తల్లిదండ్రుల గారాబమే పిల్లలకు శాపం

బుక్కపట్నం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల గారభమే పిల్లల పాలిట శాపంగా మారుతోందని సీఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, జిల్లా బాలల పరిరక్షణాధికారి మహేష్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వీఓ లీటడర్లు, మండల సమాఖ్య లీడర్లు, పిల్లల తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. పిల్లలకు గురువుగా ఉండి పిల్లల పట్ల ప్రేమానురాగాలు కలిగి ఉండాలని, అప్పుడే పిల్లలు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు చేరుతారని అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రవీంద్రారెడ్డి, సోషల్ వర్కర్ వనజాక్షి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించండి



మరమ్మతుకు లోనైన బోరును పరిశీలిస్తున్నసీపీఎం నేతలు

ధర్మవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 26వ వార్డులోని మహాత్మాగాంధీ కాలనీలో పలు సమస్యలు తిష్టవేశాయని, వాటిని పరిష్కరించేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ కాలనీలో పర్యటించిన సీపీఎం జిల్లా నాయకుడు జంగాలపల్లి పెద్దన్న, నాయకులు మాట్లాడారు. తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు తదితర కనీస సౌకర్యాలూ లేక ఈ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగునీరు పదిరోజులకు ఒకసారి మాత్రమే వస్తోందని, వేసవి కాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఉన్న బోరు చెడిపోయిందని, దానికి వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. ఆయన వెంట సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్‌లు అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, నాయకులు హైదర్‌వలీ, ఖాదర్‌బాషా ఉన్నారు.

ముదిగుబ్బ ఎంపీపీపై విచారణ


మధుకర్‌జీకి వినతి పత్రం ఇస్తున్న బాధితులు

పుట్టపర్తిటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణయాదవ్, ఆయన కుటుంబ సభ్యుల భూ కబ్జాపై విచారణకు పార్టీ కమిటీ వేసిందని, ఆ కమిటీ ఇచ్చే రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకుంటామని బీజేపీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి నూకల మధుకర్‌జీ స్పష్టం చేశారు. ముదిగుబ్బ మండలంలోని అడవిబ్రాహ్మణపల్లి తండాకు చెందిన గిరిజనులు పుట్టపర్తిలోని బీజేపీ కార్యాలయంలో మధుకర్‌జీని శుక్రవారం కలిశారు. తాము వందల సంవత్సరాలుగా సాగు తాము చేసుకొంటున్న భూములను ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణయాదవ్, ఆయన కుటుంబ సభ్యులు కబ్జా చేశారని వాపోయారు. స్పందించిన ఆయన ఈ విషయంపై పార్టీ కమిటీ వేసిందని, కమిటీ, ఆర్డీఓ రిపోర్టు వచ్చిన తరువాత మంత్రి సత్యకుమార్‌తో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బంజార గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసనాయక్, నాయకులు క్రిష్ణనాయక్, అమర్, ఆంజి, బాలు, రవీంద్ర, బీమ్లానాయక్ పాల్గొన్నారు.

రోడ్లపైనే మురుగు నిల్వ


నేలకోట తండాలో పాఠశాల వద్ద నిల్వ ఉన్న మురుగునీరు

ధర్మవరంరూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలకోట తండాలో డ్రైనేజీలు లేక రోడ్లపైనే మురుగునీరు పారుతోంది. ఇలా పారుతున్న నీరు గుంతల్లో నిల్వ ఉండటంతో.. తీవ్ర దుర్వాసన వస్తోంది. అంతేకాకుండా దోమలు కూడా విపరీతంగా పెరగడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల వద్ద కూడా మురుగు నీరు నిల్వ ఉండటంతో.. విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీటెక్ విద్యార్థి ఆచూకీ లభ్యం

నల్లమాడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎద్దులవాండ్లపల్లి గ్రామానికి చెందిన ఎద్దుల రామమోహన్‌రెడ్డి కుమారుడు, బీటెక్ విద్యార్థి ఎద్దుల లక్ష్మీకాంత్‌రెడ్డి ఆచూకీ లభ్యమైంది. తన కుమారుడు అదృశ్యమైనట్లు రామమోహన్‌రెడ్డి ఐదు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ యువకుడి ఫోన్‌నెంబర్ ఆధారంగా అతను హైదరాబాద్‌లోని ఓ టైర్ల కంపెనీలో పని చేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఆ యువకుడికి ఫోన్‌లోనే కౌన్సెలింగ్ ఇచ్చి.. స్టేషన్‌కు శుక్రవారం వచ్చేలా చేశారు. ఆ యువకుడిని డిప్యూటీ తహసీల్దార్ సునీత ముందు హాజరు పరిచామని, అనంతరం అతని తల్లిదండ్రులకు అప్పగించామని సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు.

సింధూరా.. సక్సెస్..!

అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి ప్రజాసమస్యలు



పుట్టపర్తి రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై శాసనసభలో తన గళాన్ని వినిపిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి సక్సెస్ అయ్యారు. 15 రోజుల పాటు సాగిన శాసన సభ సమావేశంలో ఎమ్మెల్యే నియోజకవర్గానికి సంబంధించినవే కాకుండా.. రాష్ట్రంలోని సమస్యలనూ లేవనెత్తారు. ముఖ్యంగా.. నియోజకవర్గంలోని 193 చెరువులను, రెండు రిజర్వాయర్లను హంద్రీనీవా నీటితో నింపాలని, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పించాలని, కొత్తగా ఏర్పాటైన సత్యసాయి జిల్లాలో కలెక్టరేట్‌తో పాటు ఇతర ప్రభుత్వ శాఖల నూతన భవనాల నిర్మించాలని, తగిన సిబ్బందిని నియమించాలని, నాడు - నేడు పనులను పూర్తి చేయాలని, టిడ్కో గృహాలను పూర్తీ చేయాలని తదితర సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, పలువురి మంత్రుల ప్రశంసలు అందుకున్నారు.

నిరుపేదలకు ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న డాక్టర్ కుటుంబ సభ్యులు

నల్లమాడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేమనకుంటపల్లితండాకు చెందిన వైద్యుడు తిపేంద్రనాయక్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆ గ్రామానికి చెందిన పది పేద కుటుంబాలకు శుక్రవారం ఆర్థికసాయం అందించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ. ఐదువేలు చొప్పున పది కుటుంబాలకు రూ.50వేలు అందించారు.

గ్రామీణ విద్యార్థులకు క్విజ్ పోటీలు


మాట్లాడుతున్న మోహన్‌మురళి

బత్తలపల్లి మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో గ్రామీణ విద్యార్థులకు రీజనల్ స్థాయి క్విజ్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. కొత్తచెరువు, మామిళ్లపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి, బత్తలపల్లి, ధర్మవరం చెందిన 10 టీము లు ఇందులో పాల్గొన్నాయి. మొదటి స్థానంలో ముదిగుబ్బ, రెండో స్థానంలో ధర్మవరం, మూడో స్థానంలో బత్తలపల్లి టీములు నిలిచాయి. ఎడ్యుకేషన్ డైరక్టర్ మోహన్‌మురళి, రీజనల్ డైరక్టర్ ప్రమీల బహుమతులు అందజేశారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

ఓబుళదేవరచెరువు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లిలో శుక్రవారం ఓడీసీ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ బి బడాయి బి పై సీడీపీఓ వరలక్ష్మీ శిక్షణ ఇచ్చారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ఆటపాటలతో నాణ్యమైన విద్యను అందించాలన్నారు. పిల్లల్లో శరీరక పెరుగుదలకు చేయాల్సిన విదివిధానాలపై వివరించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్లు విజయకుమారి, సత్యవతి, గంగాదేవి, లక్ష్మీ, నల్లమాడ, అమడగూరు, ఓడీసీ మండలాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

వ్యక్తిపై దాడి.. ముగ్గురిపై కేసు

ధర్మవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక కేతిరెడ్డికాలనీకి చెందిన రామరాజుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు శుక్రవారం తెలిపారు. కేతిరెడ్డికాలనీలో రామరాజు, చరణ్, మనోజ్, సాయి శుక్రవారం మద్యం సేవించారు. ఆ సమయంలో మాటామాటా పెరిగి గొడవపడ్డారు. ఈ గొడవలో రామరాజుపై మనోజ్, చరణ్, సాయి దాడిచేసి గాయపరిచారు. దీంతో రామరాజు ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

కదిరిఅర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నపుగుట్టతండా సమీపంలో శుక్రవారం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆరుగురిని అరెస్ట్ చేసి.. వారి నుంచి రూ.6,110 స్వాధీనం చేసుకొని.. కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఓబుళదేవరచెరువు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నంపల్లి క్రాస్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తంగేడుకుంటకు చెందిన నాగరాజు తీవ్రంగా గాయపడ్డారు. ఇతను తంగేడుకుంట నుంచి మహమ్మదాబాద్ క్రాస్ వైపు బైక్‌పై బయలుదేరాడు. ఈ బైక్‌ను ఓడీసీ నుంచి గోరంట్ల వైపు వెళ్తున్న కారు సున్నంపల్లి క్రాస్ వద్ద బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగరాజు కుడికాలు విరగడంతోపాటు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పరిశీలించారు.

అటవీప్రాంతంలో అగ్ని ప్రమాదం

సుమారు 500 ఎకరాల్లోని చెట్లు దగ్ధం

పట్టించుకోని అటవీ శాఖాధికారులు


తుమ్మలబైలు వద్ద కాలిపోతున్న చెట్లు

గాండ్లపెంట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మద్దివారిగొంది, కటారుపల్లి, తుమ్మలబైలు, గొడ్డివెలగల ప్రాంతాల్లోని కొండల్లో దాదాపు 600 ఎకరాల్లో అటవీ ప్రాంతం ఉంది. రెండు రోజుల నుంచి ఆ ప్రాంతంలో మంటలు చెలరేగడంతో.. దాదాపు 500 ఎకరాల్లోని చెట్లు కాలి బూడిదయ్యాయి. ఇలా మంటలు విస్తరిస్తూ.. ఉన్న చెట్లను దగ్ధం చేస్తున్నా.. అటవీశాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. సంవత్సరం కురిసిన వర్షాలకు ఈ ప్రాంత మంతా పచ్చదనంతో నిండిపోయింది. ఇటీవల ఎండలు ఎక్కువ కావడంతో గడ్డి ఎండిపోయింది. రెండు రోజుల క్రితం ఆకతాయిలు ఆ గడ్డికి నిప్పు పెట్టుపడడంతో మంటలు వ్యాపించాయి. అడవంతా కాలిపోతోంది. ఇప్పటికే 90 శాతం అడవి దగ్ధమైంది.

నేడు సర్వసభ్య సమావేశం

గాండ్లపెంట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్య, ఆరోగ్య, పశు, సంక్షేమ, వ్యవసాయ, ఉపాధి, రెవెన్యూ వివిధశాఖల అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తామన్నారు. అన్నిశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఈ సమావేశానికి తప్పక హాజరుకావాలన్నారు.

ప్లంబర్ల సమస్య కలెక్టర్ దృష్టికి..


కలెక్టరేట్‌లో ఎలక్ట్రికల్స్, ప్లంబర్ల సంఘం నాయకులు

ధర్మవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 650-2 సర్వేనెంబర్‌లో ఇళ్ల పట్టాలు అనర్హుల పాలైన విషయం .. జరిగిన అవినీతి.. అర్హులైన ఎలక్ట్రికల్ ప్లంబర్లకు జరిగిన అన్యాయాన్ని ఆ సంఘం నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఆ సంఘం నాయకులు సురేంద్ర, రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, లతీఫ్ శుక్రవారం వినతి పత్రం అందజేశారు. దీనిపై విచారణ చేసి.. అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

● భూకబ్జాదారులను అరెస్టు చేయాలి

పట్టణంలోని సర్వేనెంబరు 650-2 స్థలాన్ని ప్రభుత్వం ప్లంబర్స్‌కు కేటాయించిందని, ఆ భూమిని కబ్జా చేసిన వారిని అరెస్టు చేయాలని సీపీఐ నాయకులు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్‌ను శుక్రవారం కోరారు. వారిపై చట్టారీత్యా కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగు మధు, సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, ప్లంబర్స్ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆనంను కలిసిన పరిటాల శ్రీరామ్


మంత్రి ఆనంను సన్మానిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రాం నారాయణరెడ్డిని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అమరావతిలోని మంత్రి చాంబర్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శివరాత్రి ఉత్సవాలను కాటకోటేశ్వరస్వామి క్షేత్రంలో ఎలాంటి గొడవలూ లేకుండా ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నందుకు మంత్రిని సన్మానించారు. ఆయన వెంట కాటకోటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు బొట్టుకిష్ట, టీడీపీ నాయకులు జింకల రాజన్న, సాయినాథ్ ఉన్నారు. అనంతరం అర్చకుడు, టీడీపీ నాయకులు మంత్రి సత్యకుమార్‌నూ సన్మానించారు.

వారపు సంత వేలం పాట

ముదిగుబ్బ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం జరిగే కూరగాయలు, గొర్రెల వారపు సంతకు శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయంలో అధికారులు వేలం పాట నిర్వహించారు. 12 మంది డిపాజిట్ రుసుము చెల్లించి ఈ వేలం పాటలో పాల్గొన్నారు. స్థానికుడు ఉత్తమ నాయుడు రూ.11.26 లక్షలకు వారపు సంత వేలం పాటను దక్కించుకున్నారు. గత ఏడాది ఇది రూ.7.26 లక్షలు పలికింది. ఈ ఏడాది పంచాయతీకి రూ.4 లక్షలు అదన ఆదాయం వచ్చినట్లైంది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దివాకర్, పంచాయతీ కార్యదర్శి మంజుల, టీడీపీ నాయకులు రమేష్‌బాబు, కరణం ప్రభాకర్, తుమ్మల మనోహర్, కోట్ల బాబీ, సర్పంచ్ లక్ష్మీదేవి, నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ నుంచి పోలా తొలగింపు

ధర్మవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకుడు పోలా లక్ష్మీనారాయణ పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తుండటంతో అతన్ని పార్టీ నుంచి తొలగిస్తున్నట్టు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన సభ్యత్వాన్ని కూడా రద్దు చేశామన్నారు.

న్యూస్ బాక్స్

ప్లాస్టిక్ నిషేధంపై చర్యలకు శ్రీకారం



దుకాణ యజమానులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

గోరంట్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తూ అధికారులు శుక్రవారం చర్యలకు శ్రీకారం చుట్టారు. ఎంపీడీఓ నరేంద్రకుమార్, పంచాయతీ ఈఓ సుబ్రహ్మణ్యం, సిబ్బంది హోటల్, దుకాణాల యజమానులను హెచ్చరించారు. సోమవారం నుంచి ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, గ్లాసులు వినియోగించరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే మొదటిసారి రూ.5వేలు, రెండవసారి రూ.20వేలు జరిమానా విధిస్తామన్నారు. అయినా మార్పురాకపోతే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ద్వారా దుకాణాన్ని సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్‌రహిత పంచాయతీకి అందరూ సహకరించాలని ఎంపీడీఓ కోరారు.

అసెంబ్లీలో తీర్మానంపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

గోరంట్ల, మార్చి21(ఆంధ్రజ్యోతి): ఎస్సీవర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేయడంతో ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. బస్టాండ్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ అధినేత మందక్రిష్ణమాదిగ, ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రాలున్న ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు శివకుమార్, రమేష్‌బాబు, సుధీర్, ఆంజనప్ప, నాగరాజు, దండోరా నారాయణ, గంగన్న, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపులను సహించం: సీపీఐ

గోరంట్ల, మార్చి21 (ఆంధ్రజ్యోతి): వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న యానిమేటర్లను తొలగించడంపై సీపీఐ మండల కన్వీనర్ సుధాకర్, కార్యదర్శి సురేష్ అభ్యంతరం తెలిపారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో వారు ఏపీఎం నాగమణితో మాట్లాడారు. తాము అధికారికంగా ఎవరినీ తొలగించలేదని ఏపీఎం వారికి సమాధానం ఇచ్చారు. కక్షసాధింపు చర్యలకు పాల్పడవద్దని, అన్యాయం జరిగితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని సీపీఐ నాయకులు హెచ్చరించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వన్నేరప్ప



ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): హిందూపురం బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా వన్నేరప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల బార్ అసోసియేషన్ ఎన్నికల నిర్వహిణకు సంబంధించి ఎన్నికల అధికారిగా నిర్వహించిన రఘునాథరెడ్డి నోటిఫికేషన్ విడుదల చేశారు. వన్నేరప్ప, గోపాల్ అధ్యక్ష పదవికి నామినేషన్ వేశారు. ప్రధాన కార్యదర్శి పదవికి రామచంద్రప్ప, మురళి, కృష్ణమూర్తి పోటీ పడ్డారు. సీనియర్ న్యాయవాదులు నామినేషన్ దాఖలు చేసిన వారితో చర్చించి సమన్వయం చేసి అధ్యక్షులుగా వన్నేరప్పను, ప్రధాన కార్యదర్శిగా రామచంద్రప్పను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి ఏపీపీ ఇందాద్, సీనియర్ న్యాయవాదులు నాగరాజు, నాగరాజరెడ్డి, రామిరెడ్డి, శివశంకర్, ఇతర న్యాయవాదులు అభినందించారు.

భూముల పరిరక్షణకు ప్రత్యేక కమిటీ



మాట్లాడుతున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మి

లేపాక్షి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా అన్నిశాఖల ఆధ్వర్యంలో పరిరక్షణకోసం టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

అమరాపురం, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ లక్ష్మీనరసింహ సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండలస్థాయిలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. సంబంధితశాఖల అధికారులు భూములు అన్యాక్రాంతం కాకుండాచూడాలన్నారు.


నేడు ఉచిత వైద్యశిబిరం

హిందూపురం అర్బన్, మార్చి 21,(ఆంధ్రజ్యోతి): యోగినారాయణ సేవాసమితి ఆధ్వర్యంలో ఎంఎస్ రామయ్య ఆసుపత్రి బెంగళూరు వారి సౌజన్యంతో శనివారం ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సేవాసమితి హిందూపురంశాఖ అధ్యక్షుడు రవిశంకర్ తెలిపారు. పట్టణ పరిధిలోని టీటీడీ కల్యాణమంటపంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హెల్త్ క్యాంపు జరుగుతుందన్నారు. జనరల్, చర్మవ్యాధులు, యూరాలజీ, ఆర్థోపెడిక్, మూత్రపిండాల వ్యాధి, చెవి, ముక్కు, గొంతు, గుండెజబ్బులు, చిన్నపిల్లల వైద్యులు, గైనకాలజీ, జనరల్ సర్జరీకి సంబంధించిన వైద్యులు వస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవల ద్వారా మందులు ఉచితంగా అందించనున్నారన్నారు.

ఇళ్లలో ఉక్కపోత.. బయట ఎండ మోత..!

రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

అల్లాడిపోతున్న జనం



చిలమత్తూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎండలు రోజురోజుకి పెరుగుతున్నాయి. సూర్యభగవానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. వేసవి ఆరంభంలోనే 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీన్ని బట్టి చూస్తే ఏప్రిల్, మేలలో ఏరకంగా ఎండలు ఉంటాయోనన్న భయం కలుగకమానదు. ఉదయం 8 గంటలు నుంచే సూర్యప్రతాపం మొదలవుతోంది. ఇళ్లల్లో ఉందామంటే ఉక్కపోత.. బయటకు వెళదామంటే ఎండమోత అన్నట్లు ఉంది ప్రజల పరిస్థితి. దీంతో బయటకు రావాలంటే జనాలు జంకుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు ఉక్కపోతకు అల్లాడిపోతున్నారు. మూగజీవాల పరిస్థితి దయనీయంగా మారింది. పెరట్లో పెంచుకుంటున్న కోళ్లు ఎండవేడిమికి తట్టుకోలేక మృత్యువాత పడుతున్నాయి.

వడగాడ్పులతో ఇక్కట్లు

వాతావరణంలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరడంతో ఇళ్లల్లో ఉష్ణతాపాన్ని తగ్గించుకోవడానికి ఫ్యానులు, ఏసీలు నిరంతరంగా పనిచేయాల్సి వస్తోంది. అయినా వాటి ద్వారా కూడా ఉపశమనం కలగడంలేదు. బయట చెట్ల కింద కూడా గాలి రావడం లేదని, దీంతో ఉక్కుపోతకు తట్టుకోలేక దిక్కుతెలియని పరిస్థితుల్లో ఉన్నామని ప్రజలు వాపోతున్నారు. కనీసం ఒక పదును వాన కురిస్తే ముందుగా చల్లని గాలులతో ఊపిరి పీల్చుకుంటామని ప్రజలు అంటున్నారు.

కర్ణాటకకు సరిహద్దుగా ఉన్నా..

బెంగళూరు నగర వాతావరణాన్ని ఏ ప్రాంత ప్రజలైనా ఇష్టపడతారు. అదే తరహా వాతావరణాన్ని చిలమత్తూరు మండలంలో కూడా ఉంటుందని ప్రజల అభిప్రాయం. ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో ఉన్న ఉష్ణోగ్రతలను పోల్చుకుంటే చిలమత్తూరు మండలంలో వాతావరణం కొంత చల్లగానే ఉంటుంది. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లా కేంద్రంలో ఉన్నట్లుగానే ఇక్కడి ఉష్ణోగ్రతలు అధికంగానే ఉన్నాయి.

వరుణుడు కరుణిస్తాడని..

సాధారణంగా మార్చి చివర్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసి వాతావరణం కొంత చల్లబడుతుందని అంటుంటారు. ఆ వర్షాల కోసం జనం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. వాతావరణంలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోవడంతో భగర్భజలాలు పూర్తిగా అడుగంటాయి. దీంతో బోరుబావుల్లో నీళ్లు అడుగంటాయి. ఈ కారణంగా రబీలో సాగుచేస్తున్న పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

ఉష్ణోగ్రతలు పెరిగాయి



వాతావరణంలో భారీగా మార్పులు సంభవిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయి. పగటి సమయంలో ఇళ్లల్లో ఉండాలన్నా.. బయటకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంది. ఇంత వేడిమి ఎప్పుడూ చూడలేదు. ఉదయం 8 గంటలు దాటితే బయటికి వెళ్లలేని పరిస్థితి. ఉక్కుపోత ఎక్కువగా ఉండటంలో ఇంట్లో ఉండటానికి ఇబ్బంది తలెత్తుతోంది. వర్షాలు కురిసి చల్లపడితే బావుంటుంది.

- వెంకటరెడ్డి, చిన్నప్పరెడ్డిపల్లి.

ఎండలను తట్టుకోలేకపోతున్నాం



మార్చిలోనే ఇంత వేడి ఉంటుందని అనుకోలేదు. రోజూ కూలీలతో భవన నిర్మాణ పనులు చేస్తుంటాం. అయితే ఎండల కారణంగా కూలీలు పనులు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మేలలో ఎండలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

- సూర్యనారాయణ, కనిశెట్టిపల్లి. తాపీ మేస్త్రీ

పంచాయతీ కార్యదర్శిపై బదిలీ వేటు

లేపాక్షి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): లేపాక్షి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రమేష్‌పై కలెక్టర్ బదిలీవేటు వేశారు. ఇటీవల ప్రైవేట్ లేఅవుట్ విషయంలో రమేష్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన కలెక్టర్ గురువారం పుట్టపర్తి జిల్లా కార్యాలయానికి పిలిపించుకుని అతడిని మందలించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వెంటనే అక్కడి నుంచి బదిలీ చేయాలని ఎంపీడీఓకు ఉత్తర్వులు అందాయి. దీంతో అతడిని బదిలీ చేశారు. నూతన పంచాయతీ కార్యదర్శిగా సాయిప్రతాప్‌కు శుక్రవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఈఓఆర్డీ ఆనంద్‌కుమార్ తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

అగళి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయాల్లో ప్రవేశాలకు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఓ నాగరత్నమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 6-11తరగతిలో ప్రవేశాల కోసం 7, 8, 9,10,12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వివరించారు. మార్చి 22 నుంచి ఏప్రిల్ 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అన్ని వార్డుల్లో ఉత్తమ పనితీరు కనబరచాల్సిందే..

డీఎంహెచ్‌ఓ ఫైరోజ్‌బేగం

హిందూపురం అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని 5 యూపీహెచ్‌సీలలోని 43 వార్డుల్లోనూ బెస్ట్ పర్ఫార్మెన్స్ రావాల్సిందేనని డీఎంహెచ్‌ఓ ఫైరోజ్‌బేగం, ఆరోగ్యశ్రీ జిల్లా కన్వీనర్ శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని ఇందిరానగర్, బోయపేట, ముద్దిరెడ్డిపల్లి, శ్రీనివాసనగర్, లక్ష్మీపురం ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రాల్లో సిడిఆర్, ఎంఎంఆర్, హైరిస్క్ కేసులు గురించి అడిగి తెలుసుకున్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

రొళ్ల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ, ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మండల తెదేపా కన్వీనర్ దాసిరెడ్డి తెలిపారు. 18 నుండి 50 సంవత్సరాల మధ్య ఉన్న మహిళలు అర్హులని, శిక్షణ అనంతరం మహిళలకు కుట్టుమిషన్‌లను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 22వతేదీలోపు సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎలుగుబంటి దాడిలో యువకుడికి గాయాలు

అమరాపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కె.శివరం గ్రామంలోని మహంతేష్ (28) ఎలుగుబంటి దాడిలో గాయపడ్డాడు. తోటలో పచ్చగడ్డిని తీసుకురావడానికి వెళ్లగా ఎలుగుబంటి యువకుడిపై దాడి చేసింది. గ్రామస్థులు రావడంతో ఎలుగుబంటి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఫారెస్టు అధికారులు తగిన చర్యలు తీసుకుని ఎలుగుబంటి దాడి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

26న మండల సర్వసభ్య సమావేశం

గుడిబండ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 26న బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గంగాధర్ తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, జడ్పీటీసీ, ఎంపీపీ, మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఘనంగా రామచంద్ర తీర్థుల ఆరాధనోత్సవం



ప్రత్యేక అలంకరణలో రామచంద్ర తీర్థుల బృందావనం

పెనుకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఆర్టీఓ చెక్‌పోస్టు వద్ద వెలసిన ఉద్దండ రామచంద్రతీర్థుల బృందావనంలో స్వామివారి 1008 ఆరాధనోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6గంటలకు అర్చకులు నిర్మాల విసర్జన 9గంటల కు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 11గంటలకు సంస్థానపూజ, 1గంటలకు మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగంగావించారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

లేపాక్షి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. మండల పరిధిలోని కల్లూరు ఎస్సీ కాలనీలో ఐదు నెలల నుంచి తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. దీంతో ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు శుక్రవారం కల్లూరు రహదారిపై ఖాళీ బిందెలతో బైఠాయించారు. కాలనీకి నీటిని సరఫరా చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా చేస్తున్నా అధికారులు స్పందించడంలేదని, వెంటనే స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

విజయవంతం చేయండి : సీపీఎం

పెనుకొండ, మార్చి21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలు అమలు చేయాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25న చేపట్టిన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు బాబావలి, గంగాధర్, హరి మాట్లాడుతూ లైనింగ్ పనులు ఆపి హంద్రీనీవా పనులు వెడల్పు చేయాలన్నారు. సూపర్‌సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, వెంకటరాముడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి

పావగడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన దొమ్మతిమర్రి గ్రామం వద్ద ఒక శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఖాసీం(55) మృతిచెందాడు. వెంకటాపురం గ్రామానికి చెందిన ఖాసీం పని నిమిత్తం ద్విచక్రవాహనంలో దొమ్మతిమర్రి మీదుగా పెనుకొండకు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఎస్‌ఐ గురునాథ్ మృతదేహాన్ని పావగడ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

పావగడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. ఏప్రిల్ 4 వరకు పరీక్షలు జరుగుతాయని బీఈఓ ఇంద్రానమ్మ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10గంటల నుంచి 1-30వరకు పరీక్ష సమయం ఉంటుంద న్నారు. పరీక్షల సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

అన్యాయాన్ని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..?

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం

సోమందేపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు చేస్తున్న అక్రమాలు, అన్యాయాలను ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలస్వామి, ప్రధాన కార్యదర్శి కదిరప్ప ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక ప్రజా సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ నాయకుల ప్రవర్తనను తప్పుపట్టారు. అన్యాయాన్ని ప్రశ్నించిన బాలస్వామిపై దాడిచేయడం ఏంటని ప్రశ్నించారు. తనపై దాడిచేసిన టీడీపీ నాయకులు శివలింగప్ప, మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, నరసింహులు, డీవీ ఆంజనేయులు, వెంకటేశులను వెంటనే అరెస్ట్ చేయాలని బాలస్వామి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్పీ కార్యాలయం ముందు పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామన్నారు.

ప్రశాంతంగా ఇంగ్లిష్ పరీక్ష

సోమందేపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన పదవ తరగతి ఇంగ్లీషు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సెంటర్‌లో 224 మందికిగాను ఇద్దరు గైర్హాజరయ్యారు. క్రీస్తుజ్యోతి ప్రైవేట్ పాఠశాల కేంద్రంలో 273మందికిగాను ఇద్దరు గైర్హాజరయ్యారు. సీఐ రాఘవన్ బందోబస్తును పరిశీలించారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ 144సెక్షన్ అమలులో ఉందన్నారు.

పరిహారం ఇవ్వకుంటే ఆందోళన

ఏపీ రైతు సంఘం నాయకులు



రైతులతో మాట్లాడుతున్న నాయకులు

సోమందేపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): క్వారీవల్ల నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం, బకాయిలు యజమాని చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ రైతు సంఘం హరి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ నల్గొండ్రాయనపల్లికి చెందిన 26 మంది రైతులు సోమందేపల్లి చెరువుకింద పంటలు సాగుచేసుకుంటున్నారన్నారు. వీరి భూములకు ఆనుకుని ఉన్న క్వారీలో బ్లాస్టింగ్, కంకర తరలించేందుకు వచ్చి వెళ్లే టిప్పర్ల నుంచి దుమ్ము, దూళి పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. దీంతో క్వారీ యజమాని రూ. 50 వేలు రైతులకు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందని వివరించారు. 2021 సంవత్సరానికి సంబంధించి మాత్రమే పరిహారం చెల్లించాడని, తరువాత అందజేయలేదన్నారు. స్థానిక రైతులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతోపాటు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల నాయకులు రాజగోపాల్, చీల నారాయణస్వామి, కొండా వెంకటేశు, బెస్తకిష్టప్ప పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తరాదు

మున్సిపల్ చైర్మన్ రమేష్



రిజర్వాయర్ వద్ద మున్సిపల్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు

హిందూపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి వస్తున్న నీరు ఇంకా పెంచాలని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. శుక్రవారం గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడారు. హిందూపురానికి తాగునీరు అందిస్తున్న గొల్లపల్లి రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం అడిగి తెలుసుకున్నారు. మరమ్మతులకు వచ్చిన మోటార్లకు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. వేసవి కాలం ప్రారంభం కావడంతో నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ప్రతిరోజూ పది ఎంఎల్‌డి నీరు సరఫరా అవుతుందని ఒక్కసారి విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఒకటి రెండు రోజులపాటు నీరు లేకుండ పోతోందన్నారు. చిన్న చిన్న మరమ్మతులు వస్తే వెంటనే చేయాలన్నారు. ఆయన వెంట సంఘం శ్రీనివాసులు, కౌన్సిలర్లు సతీష్, అయూబ్, నాయకులు నవీన్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ స్థలంలో నిర్మాణం వద్దు

సర్పంచ్ సంధ్య, పంచాయతీ కార్మికులు



రోడ్డుపై బైఠాయించిన సర్పంచ్, సీపీఎం నాయకులు

చిలమత్తూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పంచాయతీకి ఆయువుపట్టుగా ఉన్న మార్కెట్ స్థలంలో ప్రభుత్వ హాస్టల్ భవనాన్ని నిర్మించవద్దని సర్పంచ్ సంధ్యతోపాటు పంచాయతీ కార్మికులు కోరారు. గతంలో ఉన్న ప్రభుత్వ బీసీ హాస్టల్ శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రస్తుతం కొత్త భవనం మంజూరైంది. దీంతో ఆ హాస్టల్ భవనాన్ని పంచాయతీకి చెందిన మార్కెట్ స్థలంలో నిర్మించడానికి అధికారులు చర్యలు చేపడుతుండడంతో సర్పంచ్ సంధ్య దానిని వ్యతిరేకిస్తూ శుక్రవారం పంచాయతీ కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టారు. వారపు సంత నుంచి పంచాయతీకి ఆదాయం వస్తోందని, దాని ద్వారా కార్మికులకు జీతాలు ఇవ్వడానికి వీలవుతోందన్నారు. అయితే వారపు సంత జరిగే స్థలంలో ఇప్పుడు హాస్టల్ భవనం నిర్మాణం చేపడితే సంత ఎక్కడ జరుపుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనకు సీపీఎం నాయకులు ప్రవీణ్‌తోపాటు పలువురు మద్దతు తెలిపారు. నడిరోడ్డుపై ఆందోళన చేస్తుండటంతో ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ అక్కడికి చేరుకొని వారితో మాట్లాడి అక్కడ నుంచి పంపివేశారు. అనంతరం సర్పంచ్ కార్మికులతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి డీటీ జగన్నాథంకు వినతిపత్రం అందజేశారు.

సబ్సిడీతో పరికరాలు

పరిగి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సబ్సిడీతో పరికరాలను తీసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి విజయభారతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద ట్రాక్టర్ పరికరాలు, పవర్ ట్రిల్లర్, బ్రష్, కట్టర్, బ్యాటరీ స్ప్రేయర్ పరికరాలు సబ్సిడీతో ఇస్తున్నామని, కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

చిలమత్తూరు, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు రాయితీ ధరలతో పీవీసీ పైపులను అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి వంశీకృష్ణ శుక్రవారం తెలిపారు. 2 అంగుళాలు, 2.5 3, 4 అంగుళాల సైజుతో కూడిన పైపులను రాయితీతో ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక్కో రైతుకి 20 వరకు అందజేయడం జరుగుతుందన్నారు. 2 అంగుళాల పైపు ధర రూ.390 ఉండగా ప్రభుత్వ రాయితీతో రూ.210కే ఇస్తున్నామన్నారు. పైపులు కావాల్సిన రైతులు మొత్తం ధరను డీడీ రూపంలో చెల్లిస్తే ప్రభుత్వం అందించే రాయితీ మొత్తం రైతు ఖాతాలోకి జమ అవుతుందన్నారు.

ఆర్డీటీకి విరాళం

గోరంట్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరేవాండ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం అశోక్ రూ.30,116 విరాళంగా శుక్రవారం అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఈ మొత్తాన్ని సేకరించి ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రజా సేవ కోసం ఈ డబ్బును వినియోగించాలని కోరారు. సంబంధిత చెక్కును ఆర్డీటీ ప్రతినిధి నరసింహమూర్తికి అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధ, క్రిష్ణవేణి, శ్రీదేవి, విద్యార్థులు ఉన్నారు.

వర్గీకరణపై చర్చకు ఆహ్వానించేలా చర్యలు

కర్ణాటక న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్

పావగడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఏబీసీడీ వర్గీకరణకు సంబంధించి అధికారులు, దళితనాయకులను ఆహ్వానించి ముఖ్యమంత్రితో చర్చలు జరిపేలా చేస్తామని కర్ణాటక రాష్ట్ర న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ అన్నారు. శుక్రవారం బెంగళూరులోని ఫ్రీడమ్ పార్కులో నిర్వహించిన దళితుల వప్లవాత్మక పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాగా సుప్రీంకోర్టు తీర్పుమేరకు వర్గీకరణ చేయాలని ప్రముఖ న్యాయవాది అరుణ్‌కుమార్ కోరారు. వర్గీకరణకు పావగడ నుంచి బెంగళూరుకు పెద్దఎత్తున తరలివెళ్లారు. వర్గీకరణ కోసం ఎంతవరకైనా సిద్ధమని దళిత నాయకులు సుబ్బరాజు, నారాయణప్ప రమేష్, తిప్పస్వామి, హనుమంతరాయ, నరసింహమూర్తి తదితరులు తెలిపారు.



తాగునీటి సమస్యకు పరిష్కారం

గుడిబండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబలబండ గొల్లహట్టి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించారు. తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తాగునీటి బోరుకు మోటారు బిగించి విద్యుత్ సౌకర్యం కల్పించి తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనూనాయక్, ఏఈ హరి తెలిపారు.